తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
మంగళవారం
08 సెప్టెంబర్ 2026
పేజీలు : 8

# వంద రోజుల హామీలు ఏమైనట్టు

## కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డ కోరుకంటి

**గోదావరిఖని, జనంసాక్షి :**
ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రామగుండం మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ మండిపడ్డారు. శనివారం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి ప్రారంభమైన భారీ నిరసన ర్యాలీ గోదావరిఖని ప్రధాన చౌరస్తా వరకు ఉధృతంగా సాగింది. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి పార్లమెంట్ మాజీ సభ్యులు, చెన్నూరు మాజీ శాసనసభ్యులు బాల్క సుమన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన నిరసన సభలో కోరుకంటి చందర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పిసిసి అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారెంటీలను నమ్మి ప్రజలు ఓట్లేస్తే, అధికారంలోకి వచ్చాక దారుణంగా మోసం చేశారని విమర్శించారు. వంద రోజుల్లోనే హామీలన్నీ నెరవేరుస్తామని చెప్పి, ఇన్ని రోజులు గడిచినా ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేక పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**విద్యార్థుల జీవితాలతో చెలగాటం..**
కాంగ్రెస్ పాలనలో విద్యార్థిలోకం తీవ్ర అన్యాయానికి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల కాక పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలలు, కళాశాలలు, గురుకులాల్లో కనీస సౌకర్యాలు, వసతులతో పాటు నాణ్యమైన భోజనం కూడా అందించడంలేదని విమర్శించారు. నిరుద్యోగులకు ఇస్తామన్న 2లక్షల ఉద్యోగాలు, విద్యార్థినులకు అందిస్తామన్న స్కూటీలు ఏమయ్యాయని నిలదీశారు.

**కేసీఆర్ హయాంలోనే**
**విద్యా రంగానికి స్వర్ణయుగం..**
గతంలో కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్యను అందించి, వందలాది గురుకుల పాఠశాలలను నెలకొల్పి విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేసిందని గుర్తుచేశారు. అటువంటి వ్యవస్థను ఈ ప్రభుత్వం దెబ్బతీస్తోందని దుయ్యబట్టారు. విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఇప్పటికైనా ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి నిరసనల ద్వారా తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌశిక హరి, మూల విజయరెడ్డి, హరీష్‌రెడ్డి, మేకల సమ్మన్నయాదవ్, మహిళ నాయకురాలు, పార్టీ ముఖ్య నాయకులు, పెద్ద ఎత్తున విద్యార్థి, యువత నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- బీఆర్ఎస్ హయాంలోనే విద్యారంగానికి స్వర్ణయుగం..
- విద్యార్థుల ఆగ్రహజ్వాలల్లో కాంగ్రెస్ కొట్టుకుపోవడం ఖాయం..
- నిరుద్యోగుల స్కూటీలు, ఫీజు రీయింబర్స్మెంట్, నిరుద్యోగ భృతి ఏమయ్యాయని నిలదీత..
- గురుకులాలను నాశనం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై చందర్ మండిపాటు..





## అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

### కలెక్టర్ కోయ శ్రీహర్ష


**పెద్దపల్లి,సెప్టెంబర్ 07(జనంసాక్షి) :**
అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారుసోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ,అదనపు కలెక్టర్ శ్రీరాములు తో కలిసి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. కమాన్ పూర్ మండలం నాగారం గ్రామానికి చెందిన జి. స్వప్న గ్రామ శివారులోని తమ ఇంటి నిర్మాణాన్ని అడ్డుకుంటూ స్థలాన్ని ఆక్రమించాలని చూస్తున్న జి. రమేష్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కమాన్ పూర్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన వడ్డేపల్లి చైతన్య తాను అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో బీకాం పూర్తి చేశానని, తనకు ఎక్కడైనా ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా ఉపాధి అధికారి కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన షాహిదా తమకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కరూర్ చేయాలని కోరుతూ దరఖాస్తు తీసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన దుగ్గంపూడి శ్రీనివాస్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి సర్వేనెంబర్ 58 లో గల భూమి పై హైకోర్టులో కేసు నడుస్తుందని అక్కడ అక్రమ నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా మున్సిపల్ కమిషనర్ పెద్దపల్లికి రాస్తూ విచారణ చేసి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## శంకరపట్నం బ్రిడ్జి వద్ద పేరుకుపోతున్న చెత్తాచెదారం

### దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు.. వ్యాధుల భయం

**శంకరపట్నం, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):**
శంకరపట్నం మండల కేంద్రంలోని వాగు బ్రిడ్జి ప్రాంతం తీవ్ర అపరిశుభ్రతకు నిలయంగా మారింది. స్థానిక వ్యాపారులు, చికెన్ సెంటర్లు, టిఫిన్ సెంటర్లు, గప్‌చుప్ బండ్ల నిర్వాహకులు చెత్తాచెదారం, వ్యర్థాలను బ్రిడ్జి పరిసరాల్లో యథేచ్ఛగా పడేస్తుండటంతో ప్రాంతమంతా మురుగుమయంగా మారుతోంది. చెత్తను తొలగించేందుకు సరైన చర్యలు లేకపోవడంతో రోజురోజుకు సమస్య తీవ్రతరం అవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చికెన్ సెంటర్ల నిర్వాహకులు చికెన్ వ్యర్థాలతో పాటు చనిపోయిన కోళ్లను సైతం బ్రిడ్జి పక్కన పడేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో అక్కడ తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగించే వాహనదారులు, బాటసారులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దుర్గంధం కారణంగా పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**కలుషితమవుతున్న నీరు.. ఆరోగ్యానికి ముప్పు**
బ్రిడ్జి కింద నిలిచివున్న మురుగునీటిలో చికెన్ వ్యర్థాలు, ప్లాస్టిక్, ఇతర చెత్తను పడేయడంతో నీరు కలుషితమవుతోంది. వర్షాలు కురిసిన సమయంలో ఈ వ్యర్థాలు నీటిలో కలవడంతో పరిసర ప్రాంతాల్లో మరింత దుర్గంధం వ్యాపించే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత నీరు,



పేరుకుపోయిన చెత్త కారణంగా దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు.

**అధికారులు స్పందించాలని డిమాండ్**
బ్రిడ్జి పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచడంతో పాటు చెత్తను పడేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. చికెన్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా సంబంధిత నిర్వాహకులకు అవగాహన కల్పించి, నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి బ్రిడ్జి పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, పారిశుధ్య చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై గ్రామ సర్పంచ్ గోదారి రాజేంద్రప్రసాద్ ను వివరణ కోరగా వ్యర్థాలు పడేయకుండా చర్యలు తీసుకుంటామని షాప్ నిర్వాహకులకు నోటీసు అందజేసి, నిబంధనలు లభించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## దళిత స్పీకర్ పై దుర్భాషలు - ప్రజాస్వామ్యం పై దాడి

- తాతా మధు ఎమ్మెల్సీ సభ్యత్వం వెంటనే రద్దు చేయాలి
- చట్టసభల్లో పోటీ చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలి
- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు

**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 07 (జనంసాక్షి) :**
దళితుడైన తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను కించపరిచేలా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు దుర్భాషలాడడం అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని, ఎమ్మెల్సీ అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు తీవ్రంగా ఖండించారు. సోమవారం మీడియాతో రాజేందర్ రావు మాట్లాడుతూ స్పీకర్‌ను ఏకవచనంతో సంబోధిస్తూ, 'ఎవడ్రా వాడు' అంటూ అవమానకరంగా మాట్లాడటం తాతా మధు అహంకారానికి పరాకాష్ట అని మండిపడ్డారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను అవమానించడం ఒక వ్యక్తిని కించపరచడం మాత్రమే కాదని, దళిత సమాజాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని రాజేందర్‌రావు అన్నారు. శాసనసభ స్పీకర్ పదవికి



ఉన్న గౌరవాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. దళిత స్పీకర్ పై కులపరమైన దూషణలకు పాల్పడిన తాతా మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద వెంటనే కేసు నమోదు చేయాలని రాజేందర్‌రావు డిమాండ్ చేశారు. దీంతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేసి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తాతా మధు ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేసే దిశగా శాసనమండలి చైర్మన్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఒక దళిత నేతకు జరిగిన అవమానంగా మాత్రమే ఈ ఘటనను చూడకూడదని, ఇది ప్రజాస్వామ్యానికి జరిగిన అన్యాయంగా ప్రతి ఒక్కరూ గుర్తించాలని రాజేందర్‌రావు అన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టసభలు, ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాత మధు జీవితకాలం చట్టసభలకు పోటీ చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని రాజేంద్ర రావు కోరారు.

## కమ్మరపల్లి బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా



**కమ్మర్పల్లి సెప్టెంబర్ 07(జనంసాక్షి)**బాల్కొండ శాసన సభ సభ్యులు,మాజీ మంత్రివర్యులు ప్రశాంత్ రెడ్డి మరియు బి ఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ వద్ద శాంతియుతంగా నిరసన తెలియజేస్తూన వారిని అరెస్టు చేయడని నిరసిస్తూ కమ్మరపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ధర్నా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా కమ్మరపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్ ,మరియు రాష్ట్ర నాయకులు బద్దం చిన్న రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందని ప్రభుత్వ వైఫల్యం ఎండ గడితే ఎక్కడిక్కడ అరెస్టు చేయడం దారుణం అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే వరకు బిఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాటం చేస్తూనే ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు మైలారం సుధాకర్,బిఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు కొత్తపల్లి రఘు కమ్మర్పల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు కొడిగంటి నరేందర్, మండల బి ఆర్ఎస్ ముఖ్య నాయకులు హైమద్ హుస్సేన్,బద్దం రాజేశ్వర్,మాలవత్ ప్రకాష్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు



**కమ్మర్పల్లి సెప్టెంబర్ 07 (జనంసాక్షి)**మండలంలోని ఉప్లూర్ గ్రామంలో మంజూరైన రెండు ఇందిరమ్మ ఇల్లు కు సోమవారం రోజున భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి పంచాయతీ రాజ్ తిరునాల నెంబర్ బాస వేణు గోపాల్ యాదవ్, గ్రామ సర్పంచ్ ఎనుగందుల శైలందర్ పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు వస్తాయని పేర్కొన్నారు. పేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.అలాగే ఇందిరమ్మ ఇండ్ల మంజూరు విషయంలో ప్రత్యేక చొరవ తీసుకున్న బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ముత్యాల సునీల్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి సౌందర్య,మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రేడ్డబోయిన నరేందర్,ఉప సర్పంచ్ తక్కురి శేఖర్,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మారుపాక నరేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నజీర్,షాదుల్లా, రాజేశ్వర్,బండి ఆంజనేయులు,ఇబ్రహీం, దినేష్,అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

## సిరికొండ మండలం లో ప్రజావాణికి 11 ఫిర్యాదులు

**సిరికొండ, సెప్టెంబర్ 7 (జనం సాక్షి ):** సిరికొండ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి మొత్తం 11 ఫిర్యాదులు అందాయి. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తులు సమర్పించారు.అందిన ఫిర్యాదుల్లో రెవెన్యూ శాఖకు 7, పంచాయతీరాజ్ శాఖకు 2, హౌసింగ్‌కు 1, విద్యుత్ శాఖకు 1 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. దీంతో ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల్లో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలే ఉన్నట్లు అధికారులు తెలిపారు.ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రజావాణి కార్యక్రమం ఉపయోగపడుతోందని అధికారులు పేర్కొన్నారు. ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారులకు దరఖాస్తుల రూపంలో అందజేయాలని అధికారులు కోరారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు

# బాల్ బ్యాడ్మింటన్‌లో ఓసీ 3 జట్టు విజయం

**8ఇంక్లైన్ కాలనీ,(జనంసాక్షి)**సెప్టెంబర్ 7:ఆర్జీ-2 ఏరియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏరియా స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా సోమవారం డా. ఏపీజే అబ్దుల్ కలాం స్టేడియంలో బాల్ బ్యాడ్మింటన్ (ఆన్ డ్యూటీ) పోటీలు ఉత్సాహంగా జరిగాయి.ఈ పోటీల్లో ఆర్జీ-2 ఏరియాకు చెందిన మైన్స్ గ్రూప్, ఓపెన్ కాస్ట్ గ్రూప్‌తో పాటు వివిధ విభాగాలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. ఒక్కో జట్టు నుంచి ఎనిమిది మంది క్రీడాకారులు పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. విజయం కోసం క్రీడాకారులు హోరాహోరీగా తలపడటంతో పోటీలు ఆసక్తికరంగా సాగాయి.ఫైనల్ మ్యాచ్‌లో ఓసీ3 (ఓపెన్ కాస్ట్) జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచింది. మైన్స్ గ్రూప్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేత జట్టు సభ్యులను నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్



సూపర్‌వైజర్ శ్రీ నరేందర్ రెడ్డి, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ శ్రీ మహమ్మద్ అక్రమ్ పాల్గొన్నారు. కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై క్రీడాకారులను ఉత్సాహపరిచారు ఆధ్వర్యంలో మిగిలిన క్రీడా పోటీలు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

# కేటీఆర్ అరెస్టుకు నిరసనగా బిఆర్ఎస్ నాయకుల ఆందోళన

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 7 (జనంసాక్షి).రాష్ట్ర ప్రజలకు అత్యవసరంగా పరిష్కరించాల్సిన సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు,అలాగే 22 ఏ భూముల సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతుల ప్రధాన సమస్యలపై అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీసేందుకు టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు నల్ల దుస్తులు ధరించి అసెంబ్లీకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ వేములవాడలోని తెలంగాణ చౌక్‌లో బిఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.రైతులు ఎదుర్కొంటున్న 22 ఏ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, అర్హులైన రైతుల భూములను 22 ఏ జాబితా నుంచి తొలగించి వారికి న్యాయం చేయాలని నాయకులు డిమాండ్



చేశారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని,ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు వెళ్తున్న ప్రతిపక్ష నాయకులను అడ్డుకోవడం,అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు.ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులా, రైతుల 22 ఏ సమస్యను పరిష్కరించాలని,ఆరు గ్యారెంటీలను అమలు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, కేడిసిసి బ్యాంకు డైరెక్టర్ ఏనుగు తిరుపతి రెడ్డి, మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, నాయకులు వెంగళ శ్రీకాంత్ గౌడ్, వాసాల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందు పాల్గొన్నారు.

## గంగాధర మండల సమస్యలపై ప్రజావాణిలో దరఖాస్తులు చేసిన బిఆర్ఎస్ నేతలు

**గంగాధర సెప్టెంబర్ 07(జనంసాక్షి):**కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆదేశాల మేరకు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మేచినేని నవీన్ రావు ఆధ్వర్యంలో మాజీ సర్పంచులు బిఆర్ఎస్ నాయకులు సోమవారం మండల సమస్యలపై ప్రజావాణిలో దరఖాస్తు చేశారు.అనంతరం మేచినేని మాట్లాడుతూ తెలంగాణ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు గడిచినా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని అన్నారు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరచి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు నాలుగువందల ఇరవై హామీలను వెంటనే అమలు చేయాలన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం పెట్టిన సంక్షేమ పథకాలు రైతుబంధు, రైతుభీమా, కళ్యాణలక్ష్మి, చేనేత కార్మికులకు చేయూత, కంటి వెలుగు, కెసిఆర్. కిట్,దళిత బంధు,బి.సి, బంధు వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజల సంక్షేమానికి బిఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు,ప్రస్తుత ప్రభుత్వం అట్టి సంక్షేమ పథకాలను కుట్రపూరితంగా, పేద ప్రజలకు అందకుండా నిలిపివేయటానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు.ప్రభుత్వాలు మారినా పేద ప్రజల సంక్షేమం కోసం పెట్టిన సంక్షేమ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఆరు గ్యారంటీలు నాలుగువందల ఇరవై హామీలలో భాగంగా



వృద్ధులకు నాలుగు వేల పెన్షన్, వికలాంగులకు ఆరు వేల పెన్షన్. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి. ప్రతి మహిళకు 2500 చొప్పున, రైతు కూలీలకు మరియు కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి విద్యార్థులకు ఫీజు రీయంబర్స్మెంట్ ఇవ్వకుండా పేద విద్యార్థులకు అన్యాయం చేస్తుందన్నారు విద్యార్థినులకు స్కూటీలు, రైతులకు బోనస్. దళిత బందు 12 లక్షలు, గృహిణిలకు సిలిండర్ 500కే ఇస్తామని ఇంకా అనేక హామీలు ఇచ్చి, అబద్దాలు చెప్పి ప్రభుత్వం ఏర్పాటు చేసిన 100 రోజులలో అమలు చేస్తామని చెప్పి 1000 రోజులు పూర్తి అయినా కాని ఏ ఒక్కటి అమలు చేయడం లేదు.కావున వాటిని వెంటనే సంక్షేమ పథకాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అలాగే స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హామీ ఇచ్చిన విధంగా నారాయణపూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని,గర్శకుర్తి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని,లక్ష్మీదేవిపల్లి బ్రిడ్జి పూర్తి చేయాలని, ముప్పిడి నరసయ్యపల్లి గ్రామానికి రోడ్డు వేయాలని,బొమ్మలమ్మ గుట్టను పర్యాటక కేంద్రంగా చేయాలని కోరారు.నారాయణపూర్ రిజర్వాయర్ కుడి కాలువ పనులు పూర్తి చేసి గంగాధర బోయినపల్లి రైతులకు సుమారుగా 17000 ఎకరాలకు సాగు నీరందించాలని తక్షణమే పనులు పూర్తి చేయాలనీ డిమాండ్ చేస్తూ ప్రజావాణిలో నోడల్ అధికారికి దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిలుముల సుధాకర్.మాజీ సర్పంచులు వేముల దామోదర్. మడ్లపెల్లి గంగాధర్.జోగు సాగర్.బొల్లాడి శ్రీనివాస్ రెడ్డి.వడ్లూరి ఆదిమల్లు.నాయకులు ఆకుల మధుసూదన్.మామిడి అఖిల్.పొన్నం రాములు .గంగాధర నగేష్.గర్వందుల పరిశరాములు. తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు తీరుపై రుద్రంగిలో కాంగ్రెస్ శ్రేణుల నిరసన



**రుద్రంగి, సెప్టెంబర్ 7 (జనం సాక్షి)**తెలంగాణ రాష్ట్ర మొట్టమొదటి దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అనుచిత పదజాలంతో దూషించడాన్ని నిరసిస్తూ రుద్రంగి మండల కేంద్రంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు,దళిత సంఘాల నాయకులు ఈ నిరసనలో పాల్గొన్నారు.అసెంబ్లీ గేటు వద్ద స్పీకర్ ను ఉద్దేశించి ఏకవచనంతో, అసభ్యంగా మాట్లాడడం రాజ్యాంగ పదవికే అవమానమని వారు మండిపడ్డారు.ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ చేలుకల తిరుపతి, సర్పంచ్ గండి నారాయణ, దయ్యాల శ్రీనివాస్ లు మాట్లాడుతూ...ఒక దళితుడు స్పీకర్ గా ఉంటే ఓర్వలేక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదు. ఆయన అధ్యక్షా అని పిలవడానికి కూడా అహం అడ్డొస్తోంది. నాయకుడి బాటలోనే ఆ పార్టీ నేత తాతా మధు కూడా స్పీకర్ ను అడుగడుగునా అవమానిస్తున్నారు. నిన్న కేసీఆర్ ఇదే చెప్పి అసెంబ్లీకి పంపించాడా అని అనుమానం వస్తోంది. దళిత స్పీకర్ పై ఇలాంటి భాష వాడటం బీఆర్ఎస్ దళిత వ్యతిరేక వైఖరికి నిదర్శనం అని విమర్శించారు.తాతా మధుపై వెంటనే ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని, బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎర్రం గంగ నరసయ్య, నాయకులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, గట్ల తర్రె మనోహర్, కట్కూరి దాసు, అక్కనపెల్లి శ్రీనివాస్, దయ్యాల రమేష్, దాసరి గంగా రాజం తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో బీజేపీ నాయకుల అరెస్టు



**ఇల్లంతకుంట సెప్టెంబర్ 07(జనంసాక్షి )** రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం సందర్భంగా ఇల్లంతకుంట మండలానికి చెందిన బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు నాగసముద్రాల సంతోష్, మండల ప్రధాన కార్యదర్శి పినికాశి అనిల్, బీజేవైఎం మండల అధ్యక్షుడు మంత్రి అరుణ్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఈ సందర్భంగా మాజీ మండల అధ్యక్షుడు నాగసముద్రాల సంతోష్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని అన్నారు. ప్రజా సమస్యలపై దృష్టి సారించకుండా, ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను అణచివే ందుకు పోలీసులను ఉపయోగించడం సరికాదని విమర్శించారు.రైతులు, నిరుద్యోగులు, పేదలు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులకు పాల్పడిన పోలీసుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ నాయకులు తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ పోరాటం నిరంతరం కొనసాగు తుందని, ఎన్ని అరెస్టులు చేసినా ప్రజల పక్షాన తమ ఉద్యమాన్ని ఆపేది లేదని నాయకులు స్పష్టం చేశారు.

# గణేష్ మండలి నిర్వాహకులు తప్పకుండా నిబంధనలు పాటించాలి




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 07 జనం సాక్షి :** గణేష్ మండలి నిర్వాహకులు ఈ క్రింది సూచనలు తప్పకుండా పాటించాలని కమిషనర్ ఆఫ్ పోలీస్ సాయి చైతన్య తెలిపారు.విగ్రహ ఏర్పాటు కోసం ప్రజల నుండి డబ్బులను బలవంతంగా వసూలు చేయరాదు. గణేష్ మండపాలను ఎవరికి,ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలి. మండపం ఏర్పాటు చేసే స్థలం కోసం సంబంధిత శాఖల వారికి సమాచారం ఇవ్వవలెను.గణేష్ మండళ్ల వద్ద సందర్శించే మహిళలపై, యువతులపై" ఈవ్ టీజింగ్" జరుగకుండా చూడవలెను.ప్రజలకు అసౌకర్యం కలుగకుండా డి.జె / డి.జె మిక్సర్స్ / హైఫిడిలిటి ( హైఫై ) సౌండ్సిస్టమ్ ఇక్విప్మెంటు విషయంలో చాలా జాగ్రతలు వహించాలి. కొద్ది మంది ఇండ్లలో గుండె జబ్బులు గలవారు, బి.పి గలవారు, వయసు పై బడిన వృద్దులు ఉంటారు. మరియు చదువుకునే విద్యార్థులకు ఆటంకము కలుగ కుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇట్టి సౌండ్ 12 ణవఏఙఎవశ్రీం దాటి ఉండరాదు.రాత్రి 10-00 గంటలకు " లౌడ్ స్పీకర్లు" ఆఫ్ చేయాలి. ఈ విషయంలో సుప్రీంకోర్టు నిబంధనలను పాటించాలి. లేని యెడల చట్టరిత్య చర్యలు తీసుకొనబడును.డి.జే లు పూర్తిగా నిషేదం తీసుకోవాలి. మైక్ పర్మీషన్ కోసం సంబంధిత ఎ.సి.పి ని సంప్రదించి తప్పని సరిగా పర్మిషన్ తీసుకోవాలి.విధ్యుత్ సరఫరా ఆగకుండా వీధి దీపాలు వెలిగేటట్లు చూడవలెను. షార్టు సర్క్యూట్ జరుగకుండా మంచి నాణ్యత గల వైరు ను ఉపయోగించాలి. ప్రతీ చోట ఎమ్.సి.బి ఏర్పాటు చేయాలి.ప్రజలకు అసౌకర్యం కలుగజేసే ఎటువంటి చిన్న సమాచారాన్ని అయిన మీ దగ్గరలోని పోలీసులకు తెలుపండి. లేదా డయల్ 100 కు ఫోన్ చేయగలరు లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్: 87126- 59700 కు తెలపాగలరు.ప్రతీ గణేష్ మండలి వద్ద ఉదయం వేళలో మరియు రాత్రి వేళలో ఇద్దరూ లేదా ముగ్గురికి తక్కువ కాకుండా తమ కమిటీ మెంబర్ల ను మండలి వద్ద ఉంచవలెను. పోలీస్ వారు చెకింగ్ కు వచ్చినప్పుడు ప్రతీసారి కనబడవలెను. మండపము దగ్గర అసాంఘిక చర్యలు లేకుండా చూసుకోనవలయును.ప్రతి గణేష్ మండలి దగ్గర విధిగా పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలి. పోలీసు అధికారుల తనిఖీకి వచ్చినప్పుడు అందులో వ్రాసి సంతకం చేస్తారు. " అపరిచిత " వ్యక్తుల గూర్చి సమాచారం తెలియజేయాలి.మీ దగ్గరలో ఎవ్వరయిన అనుమానస్పదంగా బ్యాగులు, ప్లాస్టిక్ సంచూలు వదిలినట్లయితే వాటిని తాకరాదు. అట్టి సమాచారం దగ్గరలోని పోలీస్ అధికారులకు తెలుపండి.. మేకలు, ఇతర జంతువులు రాకుండా తగు జాగ్రత్తలు తీసికోవాలి.గణేష్ మండలి వద్ద పూజా కార్యాక్రమంలో " క్యూ " పద్దతి పాటించాలి. "బారికేడ్లను "విధిగా ఏర్పాటు చేసుకోవాలి.ప్రత్యేకంగా లైటింగ్ సౌకర్యం కోసం మంచి నాణ్యత గల వైరు తో ప్లాస్టిక్ పి.వి.సి పైప్ ద్వారా లైటింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలి. పూర్తి సురక్షితమైన కవరుతో ఉన్న ఫద్లైట్లను మాత్రమే వాడాలి..ప్రజలకు అసౌకర్యం కలుగ కుండా నిరంతర పోలీస్ నిఘా ఏర్పాటు చేయబడింది.సంబంధిత నిర్వాహకులు అవసరం నిమిత్తం ఉపయోగించుట కొరకు మీ దగ్గరలోని పోలీస్ సిబ్బంది ఫోన్ నెంబర్లను వ్రాసి పెట్టు క. అటువంటి వాటిలో గతంలోనే ప్రొక్లేన్స్" ద్వారా పెద్ద పెద్దగా మట్టి తీసివేయడం వలన అక్కడ నీరు ఎక్కువగా నిల్వ ఉన్నా కాని కొద్దీగా ఉన్నట్లు కనబడును. కావున ఇటువంటి ప్రదేశాలలో సంబందిత పెద్ద వారు సరియైన జాగ్రత్తలు తీసుకోవాలి.అవసరానుకూలంగా సి.సి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.నిమజ్జనంచేసే సమయంలో ఎవ్వరు కూడా విన్యాసాలు చేయకూడదు. సెల్ఫోన్తో సెల్ఫీలు దిగవద్దు.వినాయక విగ్రహం తీసుకొని వచ్చే రోడ్డులో కానీ వినాయక విగ్రహం తీసుకొని వెళ్లే రూటులో కానీ ఎంత ఎత్తు గలదో అట్టి దారి పొడవున ముందుగానే చూసుకోవాలి. ఎక్కడ ఎలాంటి ప్రమాదము జరగకుండా ముందుగానే అన్ని రకాల జాగ్రత్తలు పాటించవలెను.ప్రజలు పోలీసులకు ఎల్లప్పుడు సహకరించవలెనని కమిషనర్ కోరారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం




**కమ్మర్పల్లి సెప్టెంబర్07(జనంసాక్షి)**మండలంలో ఉప్లూర్ గ్రామంలోని శ్రీ బలరాజేశ్వర స్వామి ఆలయంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కమ్మర్పల్లి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం సోమవారం రోజున కంటి వైద్య నిపుణులు లయన్ డాక్టర్ అజయ్ 122 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 33 మందికి మోతిబిందు (కాటరాక్ట్) శస్త్రచికిత్స అవసరమని డాక్టర్లు గుర్తించారు.మోతిబిందు ఆపరేషన్ అవసరమైన వారిని ఆర్మూర్ లయన్ కంటి ఆసుపత్రికి తరలించి, ఉచితంగా శస్త్రచికిత్స పూర్తయిన తర్వాత తిరిగి సురక్షితంగా గ్రామానికి తీసుకువస్తామని లయన్స్ క్లబ్ సభ్యులు వెల్లడించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీ రాజ్ ట్రిబ్యునల్ మెంబర్ బస వేణుగోపాల్ యాదవ్,సర్పంచ్ ఏనుగందుల శైలేందర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ కమ్మర్పల్లి కృషిని అభినందించారు.ప్రజలు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలని కోరారు.కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు జెల్ల సదానంద్, ఉప సర్పంచ్ తక్కురి ముత్యం,శిబిరం ఇంచార్జ్ లయన్ హనుమంతరావు, లయన్స్ క్లబ్ ఆఫ్ కమ్మర్పల్లి అధ్యక్షుడు తెడ్డూ రమేష్, ప్రధాన కార్యదర్శి హైమద్, కోశాధికారి సుంకరి విజయ్ కుమార్, డిస్ట్రిక్ చైర్మన్ లుక్కా గంగాధర్, లయన్స్ క్లబ్ కార్యవర్గ సభ్యులు సున్నం మోహన్, చింత ప్రదీప్,బద్దం రాజశేఖర్, పిప్పెర అనిల్, ఏలేటి మోహన్ రెడ్డి,మరియు గ్రామ ప్రతినిధులు డాక్టర్ నరేష్, బద్దం తిరుపతి రెడ్డి, సాధుల్లా,ఆంజనేయులు, శ్రీనివాస్,సాయిగౌడ్ మరియు మహిళలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## హామీల అమలులో జాప్యంపై నాయకుల ఆగ్రహం



**సిరికొండ, సెప్టెంబర్ 7 (జనం సాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిరికొండ మండలంలో బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని విమర్శించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేసే వరకు ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుని ప్రజలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, హామీల అమలుకు ప్రజల తరఫున నిరంతరం పోరాడుతామని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో బి.ఆర్. యస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, భూషణ్ రెడ్డి, సురేందర్, చిన్న గంగారెడ్డి, మాజీ సర్పంచ్ లు వాల్గొట్ గంగాదాసు, సిరికొండ రాజారెడ్డి, కొండూరు నర్సారెడ్డి, దేవిదాస్, జగన్, రాజారెడ్డి, మైలారం దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై అక్రమంగా బోరు వేసిన వ్యక్తిపై కేసు నమోదు

**రుద్రంగి సెప్టెంబర్ 7 (జనం సాక్షి )**రుద్రంగి మండల కేంద్రానికి చెందిన బోయిని రాజు అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా తన ఇంటి ముందు రోడ్డుపై బోర్వెల్ వేయించి ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగించాడు.ఈ విషయంపై సమాచారం అందడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించి,రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రుద్రంగి ఎస్ఐ మోతిరాం గారు తెలిపారు.ప్రభుత్వ స్థలాల్లో గానీ, రోడ్లపై గానీ ఎవరైనా అనుమతులు లేకుండా బోర్లు వేయడం,అలాగే ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగించే విధంగా ప్రవర్తించడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## జండా గద్దె విషయంలో ఇరువర్గాల ఘర్షణ



**సిరికొండ, సెప్టెంబర్ 7 (జనం సాక్షి):** సిరికొండ మండలంలోని కొండాపూర్ గ్రామంలో జండా గద్దె నిర్మాణం విషయంలో బంజారులు, గ్రామస్తుల మధ్య సోమవారం ఘర్షణ చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామంలో జండా గద్దె నిర్మించేందుకు బంజారులు పనులు ప్రారంభించగా, ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టవద్దని గ్రామ కార్యదర్శి సూచించడంతో నిర్మాణ పనులను నిలిపివేశారు.అనంతరం సోమవారం బంజారులు పూజా కార్యక్రమాలు నిర్వహించగా, గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని, పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరగడంతో కొందరు గాయాలపాలైనట్లు సమాచారం.పరిస్థితి అదుపు తప్పే అవకాశం ఉండటంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని లాఠీఛార్జి చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. అనంతరం రెవెన్యూ అధికారులు, పోలీసులు ఇరువర్గాలతో మాట్లాడి పరిస్థితిని శాంతింపజేశారు. జండా గద్దె నిర్మాణానికి సంబంధించిన సమస్యను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరూ వ్యవహరించవద్దని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా సహకరించాలని అధికారులు ఇరువర్గాలకు సూచించారు. ప్రస్తుతం కొండాపూర్‌లో పరిస్థితి అదుపులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. గ్రామంలో ఎలాంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

## ఆరెపల్లిలో 10 లక్షల ఎంజీఎఫ్ నిధులతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 07 (జనంసాక్షి) :నగరంలోని అన్ని డివిజన్లలో సమగ్ర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా కరీంనగర్ నగరపాలక సంస్థ పాలకవర్గం ముందుకు సాగుతోందని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. నగర పరిధిలోని ఒకటవ డివిజన్ ఆరెపల్లిలో మున్సిపల్ సాధారణ నిధులు (ఎంజిఎఫ్) రూ.10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.ముఖ్యంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి అందుబాటులో ఉన్న మున్సిపల్ సాధారణ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ, అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఆరెపల్లిలో నిర్మించనున్న సీసీ రోడ్డు వల్ల స్థానిక ప్రజలు, వాహనదారులకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారుతాయని తెలిపారు.అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత మున్సిపల్ అధికారులను, కాంట్రాక్టర్‌ను మేయర్ ఆదేశించారు. పనుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం, నాణ్యతా లోపాలకు తావు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నగర అభివృద్ధికి చేస్తున్న కృషికి స్థానిక కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ, మేయర్ కొలగాని శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బారి అపర్ణ జితేందర్, మున్సిపల్ అధికారులు, కాలనీ ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కేటీఆర్ హరీష్ రావుల అరెస్టుకు నిరసనగా చిగురుమామిడిలో భారీ ధర్నా




**చిగురుమామిడి సెప్టెంబర్ 7(జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 420అబద్ధపు హామీలను విస్మరించిందని,రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన 6గ్యారంటీలను బేషరతుగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారత రాష్ట్ర సమితి మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య ఆధ్వర్యంలో చిగురుమామిడి మండల కేంద్రంలో సోమవారం భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. హుస్నాబాద్ నియోజకవర్గ మాజీఎమ్మెల్యే ఒడితల సతీష్ కుమార్ ఆదేశాల మేరకు,చిగురుమామిడి మండల కేంద్రంలో మామిడి అంజయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా బిఆర్ఎస్ నాయకులు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి వారి హామీలను గుర్తు చేస్తూ రాతపూర్వక ఫిర్యాదును అందజేశారు.ప్రజా సంక్షేమాన్ని తుంగలో తొక్కిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఈ సందర్భంగా నాయకులు తీవ్రంగా ఎండగట్టారు.అనంతరం మండల కేంద్రంలో బిఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు.అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతున్న బిఆర్ఎస్ కీలక నాయకులు, ఎమ్మెల్యేలు కల్వకుంట్ల తారక రామారావు,తన్నీరు హరీష్ రావులను ప్రభుత్వం కావాలనే అవమానించి ,అక్రమంగా అరెస్టు చేసిందని మండిపడ్డారు .ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకే ఈ అరెస్టులకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమంగా అరెస్టు చేసిన కేటీఆర్,హరీష్ రావులను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాల పై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నిరసన, ధర్నా కార్యక్రమంలో మండల ప్రచార కార్యదర్శి బెజ్జంకి రాంబాబు,మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు సర్వర్ భాష,గ్రామ శాఖ అధ్యక్షులు కత్తుల రమేష్, బుర్ర తిరుపతి,సన్నీల్ల మల్లేశం,మాజీ ఎంపిటిసి మిట్టపల్లి మల్లేశం,మాజీ కోఆప్షన్ సభ్యులు మక్బూల్ పాషా, మాజీసర్పంచ్‌లు బెజ్జంకి లక్ష్మణ్, బోయిని శ్రీనివాస్,మాజీఉపసర్పంచ్ మల్లికార్జున్ రెడ్డి, అనుబంధ నాయకులు,ప్రజలు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

**యైటింక్లైన్ కాలనీ,(జనంసాక్షి) సెప్టెంబర్ 7:** వకీల్‌పల్లి మైన్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మామిడి మహేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కేంద్ర ఉప ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ముస్కె సమ్మన్న, బ్రాంచ్ కార్యదర్శి గంధం సాంబశివరావు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు.కార్మికుల సమస్యలకు సంబంధించి చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న 31 ప్రధాన డిమాండ్లపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. దీనిపై యాజమాన్యంతో పలుమార్లు చర్చలు జరిపిన అనంతరం ఆగస్టు 27, 2026న ఆర్ఎల్‌సీ సమక్షంలో 24 డిమాండ్లపై అగ్రిమెంట్ కుదిరిందని వెల్లడించారు.అగ్రిమెంట్‌లో ప్రధానంగా కార్మికులు చెల్లిస్తున్న పెర్క్స్ ఇన్‌కమ్ ట్యాక్స్‌ను రిఫండ్ చేయడం, సొంత ఇంటి పథకాన్ని అమలు చేయడం, మారుపేర్లు, విజిలెన్స్ ఎంక్వయిరీల పేరుతో పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగాలను వెంటనే అందించడం, జేఎంఈటీలకు ఓవర్‌మెన్ ప్రమోషన్లు కల్పించడం, నార్మల్ డెత్‌కు




రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించడం, క్యాడర్ స్కీమ్‌లలో మార్పులు చేయడం, హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయడం, మెడికల్ అటెండెన్స్ నిబంధనల్లో మార్పులు చేయడం వంటి అంశాలు ఉన్నాయని నాయకులు వివరించారు.తప్పుడు ప్రచారాన్ని ఖండించిన ఏఐటీయూసీ గతంలో గుర్తింపు సంఘంగా ఉన్న టీజీబీకేఎస్ ఈ అగ్రిమెంట్‌పై తప్పుడు ప్రచారం చేస్తూ కార్మికులను అయోమయానికి గురిచేసేందుకు ప్రయత్నిస్తోందని ఏఐటీయూసీ నాయకులు తీవ్రంగా ఖండించారు. . కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంక్షేమం కోసం భవిష్యత్తులోనూ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షులు అన్నారావు, సహాయ కార్యదర్శులు శాంసన్, రవికుమార్, కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర తిరుపతి, నాయకులు బొంత రాజు, మహేష్, విజయ్, మాధవ్, సభ్యులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ ముట్టడికి యత్నించిన కరీంనగర్ జిల్లా బిజెపి నేతలు

**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 07 జనంసాక్షి)** రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ "ఫీజు బకాయి – బీజేపీ లడాయి" కార్యక్రమ జ ంలో భాగంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్రావు ఆధ్వర్యంలో సోమవారం రోజున హైదరాబాదులో తలపెట్టిన చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అసెంబ్లీ ముట్టడి కోసం కరీంనగర్ బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేష్ ఆధ్వర్యంలో తరలి వెళ్లిన బీజేపీ శ్రేణులను పోలీసులు అడ్డుకుని ముందస్తు అరెస్టులు చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం తో పాటు మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడవెంకటరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస రావు, కరివేద మహిపాల్ రెడ్డి , పుప్పాల రఘు , బల్బీర్ సింగ్, అడిచెర్ల రాజు, యువర్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు నేరెడ్ల ప్రవీణ్ రెడ్డి, జిల్లా యువ మోర్చా అధ్యక్షులు సంఘ నరేష్, ఓబీసీ మోర్చా



అధ్యక్షులు ఆకుల రాజేందర్, మండల అధ్యక్షులు రాజిరెడ్డి, అనిల్ , చింతం శ్రీనివాస్, హరీష్ , దళిత మూర్చ నాయకులు అనిల్ లతో పాటు పలువురు ముఖ్య నాయకులను, కార్యకర్త లను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ప్రభుత్వ నిరంకుశత్వానికి ఈ అరెస్టులే నిదర్శనం బీజేపీ నేతల అక్రమ అరెస్టులపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, మాజీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం శాంతియుతంగా నిరసన తెలియజేస్తుంటే ప్రభుత్వం పోలీసులను ఉపయోగిం చి అణచివేయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో సుమారు రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడం వల్ల లక్షలాది మంది నిరుపేద విద్యార్థులు, విద్యాసంస్థలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు ప్రభుత్వానికి బకాయలు చెల్లించే ఉద్దేశం ఉందా లేదా అని వారు ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రభుత్వం దాటవేత ధోరణి అవలంబిస్తుందని, విద్యార్థుల బకాయిలన్నీ పూర్తిగా చెల్లించే వరకు తాము వెనకడుగు వేసే ప్రసక్తి లేదని, బీజేపీ లడాయి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు.

# 70వ ఎస్జీఎఫ్ కరీంనగర్ అర్బన్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం




**కరీంనగర్ కల్చరల్,సెప్టెంబర్ 07 (జనం సాక్షి)**కరీంనగర్ మానేరు విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 70వ ఎస్జీఎఫ్ కరీంనగర్ అర్బన్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ -- 2026-27 పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలురు, బాలికలకు నిర్వహిస్తున్న ఈ కబడ్డీ పోటీల్లో కరీంనగర్ అర్బన్ పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచాలని సూచించారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. క్రీడా ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం, పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు మరింత ప్రోత్సాహం అందించాలని ఆయన కోరారు. కబడ్డీ వంటి సంప్రదాయ క్రీడలకు విద్యార్థుల్లో మంచి ఆదరణ ఉందని, ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా గెలుపోటములను సమానంగా స్వీకరించే మనస్తత్వం అలవడుతుందని అన్నారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటాలని, తద్వారా కరీంనగర్ నగరానికి, తమ పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని మేయర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల చైర్మన్ కె. అనంతరెడ్డి, డైరెక్టర్ సునీతా రెడ్డి, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, అంతటి శంకరయ్య, తుమ్మల రమేష్, బన్సిలాల్, మల్లేష్ గౌడ్, వేణుగోపాల్, దారం గౌతమ్ రెడ్డి, కంకటి అనూప్ కుమార్, క్రీడా నిర్వాహకులు, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రాయికల్ లో జర్నలిస్ట్ లకు ఇండ్లు మంజూరు చేయాలి




**రాయికల్ సెప్టెంబర్ 7జనం సాక్షి** :అర్హులైన విలేఖరులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేసి ఇండ్లు నిర్మాణం చేసి జర్నలిస్ట్ కాలనీ ఏర్పాటు చేయాలని రాయికల్ ప్రెస్ క్లబ్ శిజాక్ రి అధ్యక్షులు చింతకుంట సాయికుమార్ ,ప్రధాన కార్యదర్శి సింగిడి శంకరయ్య కడకుంట్ల జగదీశ్వర్ లు అన్నారు రాయికల్ పట్టణంలో అనువైన ప్రదేశం డబుల్ బెడ్ వద్ద ఉన్న స్థలాన్ని మరియు నిరుపయోగంగా డబుల్ బెడ్ రూమ్ ల సముదాయంలో కూడ మండల వ్యాప్తంగా వివిధ వార్త మాధ్యమాలలో పని చెస్తూ ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా నిలిచినా జర్నలిస్ట్ లకు ఇండ్ల స్థలాలు కేటాయించి ఇండ్లు మంజూరు చేయవలసిందిగా మరియు నిరుపయోగంగా ఉన్న మధ్యలో నిలిచినా డబుల్ బెడ్ రూమ్ భవనలను ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వార పూర్తీ చేసి సీనియారిటీ ప్రతి పదికన జర్నలిస్టు లకు కేటాయించవలసిందిగా డిమాండ్ చేశారు. ఇట్టి అంశంపై తహసీల్దార్ నాగార్జున సానుకూలంగా స్పందించారు. ఇట్టి కార్యక్రమంలో ఎండి ముజఫర్ గుర్రాల వేణు , ఉపధ్యక్షులు యాచమనేని కిరణ్ కుమార్ సింగని శ్యామ్ సుందర్ , ఓరుగంటి బీమారాజ్,ఇమ్మడి విజయ్ ,కళ్లెం శ్రీనివాస్ మాలావత్ వెంకటేష్ ,గంట్యాల ప్రవీణ్ మహమ్మద్ షాకీర్ కోమటి రెడ్డి కృష్ణ రెడ్డి ,గంట్యాల ప్రవీణ్ ,మామడిపల్లి మారుతి ,ఇర్ఫాన్ ,కొండ కళ్యాణ్ ఉరుమడ్ల సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు పోలీస్ శాఖ అండ




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 7 జనం సాక్షి** :పోలీస్ ఉద్యోగాలను లక్ష్యంగా చేసుకుని పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు అండగా నిలిచేందుకు నిజామాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రీ-రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని గిరిరాజు ప్రభుత్వ కాలేజీ ఆడిటోరియం యందు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ప్రారంభించారు. తెలంగాణ పోలీస్ శాఖలో కానిస్టేబుల్ , సబ్-ఇన్‌స్పెక్టర్ తదితర ఉద్యోగాలను సాధించాలనే లక్ష్యంతో ఉన్న నిరుద్యోగ యువతకు నాణ్యమైన శిక్షణ , సరైన మార్గదర్శకత్వం అందించడంతో పాటు పోటీ పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కొనే విధంగా వారిని తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 60 రోజుల పాటు ఉచిత శిక్షణఈ ప్రీ-రిక్రూట్‌మెంట్ శిక్షణ కార్యక్రమం 60 రోజుల పాటు కొనసాగుతుంది. హైదరాబాద్‌కు చెందిన భాగ్య కిరణ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు , నిపుణులచే అభ్యర్థులకు శిక్షణ అందించనున్నారు అ.ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహించబ డతాయి. ఈ శిక్షణ కార్యక్రమం నిజామాబాద్‌లోని గిరిరాజ్ కళాశాల ఆడిటోరియం లో కొనసాగుతుంది.పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ శిక్షణలో భాగంగా పోలీస్ రిక్రూట్‌మెంట్ పోటీ పరీక్షలకు అవసరమైన వివిధ అంశాలపై అభ్యర్థులకు సమగ్ర అవగాహన కల్పించనున్నారు. పరీక్షలో ప్రశ్నలను వేగంగా , కచ్చితంగా పరిష్కరించే విధానం , సమయపాలన , పరీక్షా విధానం , ముఖ్యమైన అంశాలపై దృష్టి పెట్టడం వంటి అంశాల్లో నిపుణులచే మార్గదర్శకత్వం అందించనున్నారు. అభ్యర్థులు ఈ 60 రోజుల శిక్షణను ఎంతో విలువైన అవకాశంగా భావించి, ప్రతిరోజూ క్రమం తప్పకుండా తరగతులకు హాజరై, అధ్యాపకులు సూచించే విధంగా కష్టపడి చదివి, నిరంతరం సాధన చేయాలని కమిషనర్ సూచించారు. కేవలం శిక్షణకు హాజరవడం మాత్రమే కాకుండా, ప్రతిరోజూ నేర్చుకున్న అంశాలను పునశ్చరణ చేసుకుంటూ, తమ బలహీనతలను గుర్తించి వాటిని అధిగమించేలా కృషి చేయాలని అన్నారు. పోలీస్ ఉద్యోగం సాధించాలనే స్పష్టమైన లక్ష్యంతో క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమతో ముందుకు సాగితే విజయం తప్పకుండా సాధించవచ్చని అభ్యర్థులకు పోలీస్ కమిషనర్ భరోసా కల్పించారు. ఈ సందర్భంగా గిరిరాజ్ కాలేజీ ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి ,భాగ్య కిరణ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ భాగ్య కిరణ్ నిజామాబాద్ ఆర్మూర్ , బోధన్ , సి.టి.సి ఎ. సి. పి లు ప్రకాష్ యాదవ్ , వెంకటేశ్వర్ రెడ్డి , శ్రీనివాస్ , రాజశేఖర్ , జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి నిజామాబాద్ టౌన్ సిఐ శ్రీనివాస్ రాజ్ నిజామాబాద్ రూరల్ సిఐలు సతీష్ కుమార్ శ్రీనివాస్ మహిళా పోలీస్ స్టేషన్ సిఐ శ్రీలత సిసిఆర్బి ఎస్ఐ వరప్రసాద్ రెడ్డి , టౌన్ 3ఎస్ఐ హరిబాబు టౌన్ 6 ఎస్సై సందీప్ , టౌన్ 5ఎస్ఐ సునీల్ సిసిఆర్బి ఎస్ఐ వెంకట్రావు మరియు ఫాకల్టీ , విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# రుద్రంగి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ప్రత్యేక సమావేశం



**రుద్రంగి సెప్టెంబర్ 7 (జనం సాక్షి)**రుద్రంగి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ప్రత్యేక సమావేశం మండల ఇంచార్జ్ దయ్యాల నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ నెల 9వ తేదీన వరంగల్ లో శ్రీ మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జరగనున్న ఎమ్మార్పీఎస్ జాతీయ సదస్సును విజయవంతం చేయాలని ఈ సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ జాతీయ సదస్సుకు మండలంలోని అన్ని గ్రామాల నుండి ఎమ్మార్పీఎస్ నాయకులు, సీనియర్ నాయకులు, మేధావులు, యువకులు అధిక సంఖ్యలో తరలివెళ్లి సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సింగారపు గంగాధర్ ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి దయ్యాల రమేష్ ఎంఎస్పి మండల అధ్యక్షుడు దయ్యాల నరేష్ ఎంఎస్పి అధికార ప్రతినిధి తర్రే తిరుపతి గసికంటి నవీన్ పూడూరి సామ్రాట్ గాసికంటి నితిన్ గాసికంటి చింటూ చిటిపాక సంపత్ పూడూరి వంశీకృష్ణ చిట్టిపాక వివేక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి వినతుల వెల్లువ



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 7 జనం సాక్షి** :ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 116 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ భుజంగరావు తో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, డీపీఓ శ్రీనివాస్ రావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తాతా మధు చేసిన అనుచిత వాఖ్యానాలపై నేడు కాంగ్రెస్ పార్టీ నిరసన

**గంగాధర సెప్టెంబర్ 07(జనంసాక్షి)**:తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్థూ నేడు నిరసన కార్యక్రమం చేపడతామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి మహేందర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మరియు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు గంగాధర మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మధురానగర్ ఎక్స్ రోడ్డు అంబేద్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపడతామని రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న దళిత నాయకుడైన తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను అవమానించినందుకు నిరసన తెలుపుతూ తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేసి ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నిరసన కార్యక్రమం చేపడతామని మరియు ఈ నిరసన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# కమాన్‌పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడికి ఆత్మీయ సత్కారం



**కమాన్‌పూర్, సెప్టెంబర్ 07, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన సయ్యద్ సయిూద్ అన్వర్‌కు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా సముద్రాల శ్రీనివాసచార్యులు, గడ్డం మురళి, రెబల్ రాజ్‌కుమార్, మల్యాల మహేష్‌గౌడ్, భూంపెల్లి మొండయ్య, పల్లె రమేష్, తాటిపెల్లి శ్రీనివాస్ తదితరులు అన్వర్‌కు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. మరోసారి పార్టీ మండల అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేస్తూ, నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేలను అరెస్టు చేస్తారా



**ముస్తాబాద్ సెప్టెంబరు 7 (జనం సాక్షి)**ముస్తాబాద్ మండల కేంద్రంలోని బిఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాజీ రైతుబంధు అధ్యక్షులు కల్వకుంట్ల గోపాల్ రావు మాట్లాడుతూ ఎమ్మెల్యేలను అరెస్టు చేస్తారా ఇదేనా ప్రజాస్వామ్యం అసెంబ్లీకి వెళ్లకుండా హరీష్ రావును కేటీఆర్ ను అడ్డుకోవడం దుర్మార్గం, ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధిని అసెంబ్లీకి వెళ్లకుండా అడ్డుకోవడం, పోలీసులు అదుపులోనికి తీసుకోవడం ప్రజాస్వామ్యం విలువలను అవమానపరిచినట్టేనని కల్వకుంట్ల గోపాల్ రావు అన్నారు. మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ను, కేటీఆర్ ను పోలీసులు అదుపులోనికి తీసుకున్న ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్ష నేతలను సభకు వెళ్లకుండా అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వం ప్రజల గొంతును అణిచి వేయాలని చూసేస్తుందనే భావన ప్రజలు కలుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు బొంపల్లి సురేందర్రావు, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, కొమ్ము బాలయ్య, కొండ శ్రీనివాస్ గౌడ్, ఎండి సర్వర్ పాషా, దమ్మ రవీందర్ రెడ్డి ,రాసమడుగు సంతోష్ రావు,ఎద్దిండి నరసింహారెడ్డి, గూడూరు భరత్, కొమ్మేట రాజు, శీలం స్వామి, కోడె శ్రీనివాస్, యాది మల్లేష్ యాదవ్, ఎండి అన్వర్, కోటగిరి ఎల్లయ్య, బిఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# స్పీకర్‌పై వ్యాఖ్యలు చేసిన తాతా మధుపై చర్యలు తీసుకోవాలి

**బోయినపల్లి సెప్టెంబర్ 07 ( జనం సాక్షి)** తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను దుండ్రపల్లి సర్పంచ్ జంగం అంజయ్య తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను కించపరచడం ప్రజాస్వామ్య వ్యవస్థను, శాసనసభ గౌరవాన్ని అవమానించడమేనన్నారు.తాతా మధుపై తక్షణమే క్రమశిక్షణ చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని, ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తన పార్టీ ఎమ్మెల్సీ చేసిన వ్యాఖ్యలపై మాజీ సీఎం కేసీఆర్ సమాధానం చెప్పాలని అంజయ్య కోరారు.

# గ్రాండ్ పేరెంట్స్ డే పోషకాహార వారోత్సవం ఘనంగా నిర్వహణ

**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 07, ( జనం సాక్షి)**శ్రీ సరస్వతి శిశుమందిర్ హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గ్రాండ్ పేరెంట్స్ డే, పోషకాహార వారోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో కుటుంబ విలువలు, పెద్దల పట్ల గౌరవం, ఆరోగ్యం, పౌష్టికాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు.పోషకాహార వారోత్సవంలో భాగంగా విద్యార్థులకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు సంపూర్ణ రక్త పరీక్షలు నిర్వహించగా, వైద్యురాలు డాక్టర్ అనూష సమతుల్య ఆహారం, పౌష్టికాహారం ప్రాముఖ్యత, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు.గ్రాండ్ పేరెంట్స్ డే సందర్భంగా విద్యార్థుల తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మలను పాఠశాలకు ఆహ్వానించి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దల పట్ల ప్రేమ, గౌరవం, కృతజ్ఞతా భావాలను పెంపొందించేలా విద్యార్థులు వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు ఎర్రమరాజు సింగమ రాజు




కుటుంబంలో తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మల పాత్ర, వారి అనుభవం, ఆప్యాయత, మార్గదర్శకత్వం గురించి విద్యార్థులకు వివరించారు.గ్రాండ్ పేరెంట్స్ ప్రాముఖ్యతపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తరగతుల వారీగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ మాట్లాడుతూ పిల్లల వ్యక్తిత్వ వికాసంలో కుటుంబ పెద్దల ప్రేమ, అనుభవం, సంస్కారం ఎంతో విలువైనవని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పౌష్టికాహారం, సమతుల్య ఆహారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 38వ వార్డు కార్పొరేటర్ దేవసాని సరస్వతీ సత్యం, 36వ వార్డు కార్పొరేటర్ కోడూరి చంద్ర హాజరయ్యారు. పాఠశాల కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి, సభ్యులు తణుకు మహేష్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మ్యాడమ్ శివకాంత్, ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# పేదల సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**గంభీరావుపేట, సెప్టెంబర్ 7 జనం సాక్షి;** మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సోమవారం భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె కవిత--శ్రీనివాస్ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేసి, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమానికి ఎంపీడీవో రాజేందర్ తో పాటు మాజీ జెడ్పీటీసీ మల్లు నర్సాగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు నిమ్మల తిరుపతి గౌడ్, పర్ష హనుమాన్లు, ప్రెస్ క్లబ్ జిల్లా ఉపాధ్యక్షులు గాండ్ల రవి, మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అబ్దుల్ రహీం, తెలంగాణ పత్రిక రిపోర్టర్ సిరిపురం అంజయ్య , మైత్రి ఛానల్ రిపోర్టర్ బరిగల రమేష్, ఇంద్రమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు హమీద్, లక్కం నాంపల్లి, వేషాల వెంకటి, మార్కెట్ డైరెక్టర్ ఎడబోయిన ప్రభాకర్, వార్డు సభ్యురాలు అక్క పెల్లి లతా కాంగ్రెస్ నాయకులు శెట్టి శేఖర్, ప్రవీణ్, కూర సురేష్, వేషాల రామచంద్రం, పల్లె బాలయ్య, తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నెరవేర్చడమే



కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిజమైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పూర్తిస్థాయిలో అందలేదని ఆరోపించారు.ప్రస్తుతం అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని, సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు లబ్ధిదారులకు సహకారం అందిస్తామని పేర్కొన్నారు .ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ సందర్భంగా పల్లె కవిత--శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కమిటీ సభ్యులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు

# ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలు ఘనంగా ప్రారంభం

**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 7 , ( జనం సాక్షి)** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలతో దేశం తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడుతోందని ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ ఆరోపించారు. కరీంనగర్‌లోని పద్మనాయక కళ్యాణ మండపంలో ఏఐటీయూసీ రాష్ట్ర 4వ మహాసభల ప్రతినిధుల సభ సోమవారం ఘనంగా ప్రారంభమైంది.మహాసభల ప్రారంభ సూచికగా అమరవీరుడు మాదన నారాయణ స్మారక ప్రాంగణంలో ఏఐటీయూసీ జెండాను అమర్‌జీత్ కౌర్ ఆవిష్కరించారు. అనంతరం మహాసభల చీఫ్ ప్యాట్రన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అమరవీరుల స్మారక స్తూపాన్ని ఆవిష్కరించారు. ప్రతినిధుల సభకు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ యూసుఫ్ అధ్యక్షత వహించగా, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ స్వాగత ప్రసంగం చేశారు.ఈ సందర్భంగా అమర్‌జీత్ కౌర్ మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ సంక్షోభం, నిరుద్యోగం రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ పాలనలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు నిధుల కోత విధిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలు, జాతీయ ఆస్తులను బడా కార్పొరేట్లు, విదేశీ కంపెనీలకు అప్పగించే విధానాలను కేంద్రం




అనుసరిస్తోందని ఆరోపించారు. అసంఘటిత రంగంలోని కార్మికులకు కనీస వేతనాలు, సామాజిక భద్రత, పెన్షన్ వంటి సౌకర్యాలు అందడం లేదని అన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాలతో కార్మికులకు ఉద్యోగ భద్రత కరువైందని పేర్కొన్నారు. నాలుగు కార్మిక చట్టాలను అమలు చేయడం ద్వారా కార్మికుల హక్కులను హరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు..ఆహ్వాన సంఘం అధ్యక్షుడు పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా కార్మిక ఉద్యమ చరిత్రకు మహాసభలు మరింత బలాన్ని చేకూర్చాలని అన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు భవిష్యత్ కార్మిక ఉద్యమాలకు దిశానిర్దేశం చేసేలా తీర్మానాలు చేయాలని పిలుపునిచ్చారు.మహాసభకు సౌహార్ద సందేశాలు అందించిన వివిధ కార్మిక సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై విమర్శలు చేశారు. నాలుగు కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు .కార్యక్రమంలో ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య డిప్యూటీ ప్రధాన కార్యదర్శి సి. శ్రీకుమార్, ఏఐటీయూసీ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి వెంకట సుబ్బయ్య, సీఐటీయూ, హెచ్‌ఎంఎస్, టీయూసీఐ నాయకులు పాలడుగు భాస్కర్, ఉపేందర్, సూర్యం, ఆహ్వాన సంఘం ప్యాట్రన్ కలవేన శంకర్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు వి.ఎస్. బోస్, వాసిరెడ్డి సీతారామయ్య, ఎం. నర్సింహా, కె. యేసురత్నం,తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ పత్రాలతో ఉద్యోగం పొందిన అభ్యర్థి పై చర్యలు తీసుకోవాలి

**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 07 (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో నేషనల్ హెల్త్ మిషన్ కింద జారీ చేసిన నోటిఫికేషన్ 2024 ఫిబ్రవరి 27న డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ పోస్టు నియామకంలో తీవ్ర అక్రమాలు జరిగాయని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం రోజు జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బద్రి నేత, బాధితుడు బాలసంకుల నగేష్ కలిసి జిల్లా కలెక్టర్‌కు ఆధారాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ ఫిర్యాదు పై వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్, సమగ్ర విచారణ చేపట్టి నివేదిక అందించాలని జిల్లా రెవెన్యూ అధికారిని ఆదేశించారు.ప్రజావాణిలో సమర్పించిన వినతిపత్రం – అర్హత లేని అభ్యర్థికి పోస్టు నోటిఫికేషన్ నిబంధనలకు విరుద్ధంగా, జాప లత (తండ్రి గోపాల్‌రెడ్డి) అనే అభ్యర్థి నకిలీ/భోగస్ డిగ్రీ విద్యార్హత పత్రాలతో దరఖాస్తు చేసుకోగా, అధికారుల అండదండలతో ఆ పోస్టును




కేటాయించడం జరిగిందని, నకిలీ పత్రాలతో ఉద్యోగం పొందిన జాప లతను తక్షణమే విధి నిర్వహణ నుండి తొలగించాలని, ఇప్పటివరకు ప్రభుత్వం నుండి పొందిన జీతభత్యాల మొత్తాన్ని రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. భోగస్ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందిన అభ్యర్థిపై, ఈ అక్రమానికి సహకరించిన నాటి డీఎంహెచ్వో , సీనియర్ అసిస్టెంట్ పండు పై 'చీటింగ్' క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. అక్రమ నియామకాన్ని వెంటనే రద్దు చేసి, నోటిఫికేషన్ నిబంధనల ప్రకారం అర్హత ఉన్న ఇతర మెరిట్ అభ్యర్థికి ఆ ఉద్యోగం కేటాయించి న్యాయం చేయాలని స్పష్టం చేశారు. యూజీసీ/ డిఈబి గుర్తింపు లేని ప్రాంతీయ పరిధి దాటి పొందిన భోగస్ డిగ్రీలు, దూరవిద్య కోర్సులు ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు చెల్లవని ఇటీవల సుప్రీం కోర్టు, తెలంగాణ హైకోర్టు స్పష్టమైన తీర్పులు ఇచ్చాయని, నిబంధనలకు విరుద్ధంగా పొందిన డిగ్రీలకు ఎలాంటి "నెగెటివ్ ఈక్వాలిటీ" వర్తించదని కోర్టులు స్పష్టం చేసిన దృష్ట్యా, ఈ నియామకం పూర్తిగా చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులకు తక్షణమే న్యాయం చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి బండారి శేఖర్, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు డిమాండ్ చేశారు.

# తండ్రి జ్ఞాపకార్థం గ్రామపంచాయతీకి కానుకగా బాడీ ఫ్రీజర్ వితరణ

**మల్లాపూర్,సెప్టెంబర్ 08(జనంసాక్షి)** తండ్రి మరణాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామానికి ఏదైనా సేవ చేయాలనే సంకల్పంతో నవతెలంగాణ రిపోర్టర్,శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నిమిషకవి రాజేష్ తన తండ్రి సారంగం జ్ఞాపకార్థం గ్రామపంచాయతీకి బాడీ ఫ్రీజర్‌ను అందజేశారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..పది రూపాయలు ఖర్చు చేయాలన్నా ఆలోచించే ప్రస్తుత రోజుల్లో తండ్రి జ్ఞాపకార్థం సొంతంగా ఖర్చు చేసి గ్రామ ప్రజల కోసం బాడీ ఫ్రీజర్ అందించడం అభినందనీయమన్నారు. ఇతరులకు ఆదర్శంగా నిలిచేలా రాజేష్ సేవా కార్యక్రమం చేపట్టారని కొనియాడారు.రాజేష్ మాట్లాడుతూ.. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో తాను తీసుకున్న చిన్న పాలసీ ద్వారా రూ.10 లక్షల ప్రయోజనం లభించిందన్నారు.అందులో భాగంగా తన తండ్రి జ్ఞాపకార్థం గ్రామపంచాయతీకి చిన్న కానుకగా బాడీ ఫ్రీజర్‌ను అందించినట్లు తెలిపారు



.మండలంలోని ఏ గ్రామంలోనైనా రాత్రి సమయం లో ఎవరైనా మృతిచెందినప్పుడు ఈ బాడీ ఫ్రీజర్‌ను వినియోగిం చుకోవచ్చని,అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రవ ంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ నిజామా బాద్ జోన్ డీజీఎం సురేష్,నిర్మల్ డివిజన్ డీఎం రవి,మెట్ పల్లి బ్రాంచ్ మేనేజర్ నరేష్,కిసాన్ సెల్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఎల్లాల జలపతి రెడ్డి ,గ్రామ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్,ఉపసర్పంచ్ గడ్డం సోమారెడ్డి,బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనోవాస్,జూనియర్ అసిస్టెంట్ మనోహర్ రెడ్డి, బిల్ కలెక్టర్ జగన్,వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# 200 కోట్లతో ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాభివృద్ధి

**జగిత్యాల బ్యూరో సెప్టెంబర్ 7 (జనం సాక్షి)**దక్షిణ కాశీగా, పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన భవిష్యత్తు సరికొత్త శోభను సంతరించుకోనుంది. దశాబ్దాలుగా భక్తులు, స్థానికులు కోరుకుంటున్న ఆలయాభివృద్ధి కల నెరవేరుస్తూ ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. సోమవారం వేకువజామున 2:58 గంటలకు వేద పండితులు నిర్ణయించిన శుభ ముహూర్తంలో రూ. 10 కోట్లతో చేపట్టిన శ్రీ ఉగ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లు వైభవంగా భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు స్థానిక శాసనసభ్యులు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కోసం అదనంగా నిధులు కోరగా... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గసూచనల మేరకు మరో రూ. 80 కోట్లను సాంక్షన్ చేశామని, మొత్తంగా రూ. 200 కోట్ల అంచనా వ్యయంతో ధర్మపురి క్షేత్రాన్ని అంతర్జాతీయ స్థాయి పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దే పవిత్ర కార్యానికి శ్రీకారం చుట్టాం" అని పేర్కొన్నారు. అదేవిధంగా బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పుష్కరాలకు



సంబంధించి అన్ని ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని వివరించారు. గోదావరి పుష్కరాల్లో భాగంగా గోదావరి నది ప్రవాహం వెంట ఉన్న ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. ఆలయంలో చేపట్టిన శంకుస్థాపన కార్యక్రమాలు రూ. 10 కోట్లతో శ్రీ ఉగ్ర లక్ష్మీనరసింహస్వామి దేవాలయ పునర్నిర్మాణం. రూ. 58.55 కోట్లతో మొత్తం 9 రకాల మౌలిక వసతులు, ఆలయాభివృద్ధి నిర్మాణ పనులకు శంకుస్థాపన.రూ. 22.16 కోట్లతో పవిత్ర గోదావరి పుష్కరాల నిమిత్తం నూతన పుష్కర ఘాట్ల నిర్మాణం.రూ. 2.48 కోట్లతో ధర్మపురి మండలం తిమ్మపూర్ వద్ద నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన.పజా ప్రభుత్వం చొరవతో ప్రసిద్ధ ధర్మపురి పుణ్యక్షేత్రం రూ. 200 కోట్ల వ్యయంతో మారబోతుండటం పట్ల భక్తులు, స్థానిక ప్రజలు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ కమిషనర్ హనుమ ంతరావు, జిల్లా కలెక్టర్ సత్తి ప్రసాద్, స్థానిక మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## వెయ్యి రోజుల పాలనలో హామీల అమలులో విఫలం



**కమాన్‌పూర్, సెప్టెంబర్ 07, (జనంసాక్షి) :** ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ప్రజల ముందు 420గా నిలిచిందని బీఆర్ఎస్ కమాన్ పూర్ మండల మాజీ అధ్యక్షుడు తాటికొండ శంకర్, యూత్ మండల మాజీ అధ్యక్షుడు బొమ్మగాని అనిల్ గౌడ్ ఆరోపించారు. పార్టీ అధిష్టానం, మంథని నియోజకవర్గ ఇన్చార్జి పుట్ట మధు ఆదేశాల మేరకు సోమవారం పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవో ప్రియాంక కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పాదయాత్ర భక్తులకు పండ్లు మంచినీటిని అందించిన సాలూర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందర్న రవి



**బోధన్, సెప్టెంబర్ 7 ( జనంసాక్షి ) :** బోధన్ పట్టణంలోని శివాలయానికి పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందర్న రవి ఆధ్వర్యంలో పండ్లు, మంచినీటి వితరణ చేశారు. శ్రావణమాసం చివరి సందర్భంగా సాలూర మండలంలోని పలు గ్రామాల భక్తులు ప్రసిద్ధిగాంచిన శ్రీ ఏక చక్ర శివాలయంకు పాదయాత్రగా వెళుతుంటారు. ఈ క్రమంలో సాలూర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందర్న రవి ఆధ్వర్యంలో పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు పండ్లు మరియు మంచి నీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రావణమాసం చివరి రోజున ప్రతి సంవత్సరం లాగానే పాదయాత్రగా వెళ్లే భక్తులకు పండ్లు మరియు మంచినీటిని అందించడం జరుగుతుందన్నారు. లోక కళ్యాణం,ప్రజల సంక్షేమం కొరకు ఈ పాదయాత్ర నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మందర్న గ్రామస్తులు సుభాష్ పటేల్, గోపాల్ పటేల్, సుధాకర్ పటేల్, ఓట్లప్ప, బాలు, ఈరం సందీప్, మహిళా భక్తులు, చిన్నారులు, యువకులు పాల్గొన్నారు.

## గణేశ్ నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలి



**పెద్ద కొడప్గల్ సెప్టెంబర్ 07 (జనంసాక్షి):** పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం ఎస్ఐ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. గణేశ్ మండప నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ సూచించారు. గణేశ్ మండపం ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, విద్యుత్ తో జాగ్రత్తగా ఉండాలని, డీజే లను ఉపయోగించవద్దని, ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలని, గొడవలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, కావాలని ఎవరైనా గొడవ పడితే తమకు తెలియజేయాలని, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గణేశ్ మండప నిర్వాహకులు, మండల ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీసిద్ధరామేశ్వర స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తజనం



**భిక్కనూరు సెప్టెంబర్ 07 (జనం సాక్షి):**-భిక్కనూరు మండల కేంద్రంలో గల ప్రసిద్ధిగాంచిన శైవకక్షేత్రం దక్షిణ కాశీగా కొలిచే శ్రీసిద్ధరామేశ్వర స్వామి స్వయంభూలింగ మహాక్షేత్రంలో శ్రావణమాసంలో చివరి సోమవారం కావడంతో భక్తులు వివిధ జిల్లాల నుండి,ఇతర రాష్ట్రాల నుండి వేకువ జామున దేవాలయంకు చేరుకొని మూలబావి నీటితో స్నానాలు ఆచరించి,స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలతో దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు,భక్తుల రాకతో దేవాలయ ప్రాంగణం శివనామస్మరణతో మారుమోగింది,ఈక్రమంలో దేవాలయ ప్రధాన అర్చకులు కొడకండ్ల రామగిరిశర్మ,కొడకండ్ల నవీన్ కుమార్ శర్మ,న్యాలకంటి రాజేశ్వర శర్మ వారు ప్రత్యేక అభిషేకాలు,ప్రత్యేక సత్యనారాయణ స్వామి వ్రతాలు,స్వామి వారికి కోడిమొక్కులను భక్తులు చెల్లించుకుని,భక్తుల సహకారంతో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమం హైదరాబాద్ వాస్తవ్యులు శ్రీ మంచి కట్ల ముత్తయ్య వారి కుటుంబ సభ్యుల సహకారంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు,భక్తుల సౌకర్యార్థం దేవాలయ పున:నిర్మాణ కమిటీ చైర్మన్ తాటిపాముల లింబాద్రి,కమిటీసభ్యుల సహకారంతో భక్తులకు కావలసిన అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు చేశారు,భక్తుల రాకతో దేవాలయం ప్రాంగణం పండగ వాతావరణంతో సందడిగా మారింది, స్వామివారి దర్శనం చేసుకున్న భక్తులు సంతోషని వ్యక్తపరిచారు.



## అత్యవసర వేళ సీఎం సహాయనిధి అండ



**సిరికొండ, సెప్టెంబర్ 7 (జనం సాక్షి):** అత్యవసర సమయంలో నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా నిలుస్తుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి అన్నారు. సిరికొండ మండలం పెద్దవాల్గోట్ గ్రామానికి చెందిన సంగెం నిక్లేష్ అనారోగ్య సమస్యలతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.నిక్లేష్‌కు శస్త్రచికిత్స అవసరమైందని, ఇందుకోసం సుమారు రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు సూచించారు. విషయం ఎమ్మెల్యే భూపతి రెడ్డి దృష్టికి వెళ్లడంతో సీఎం సహాయనిధి నుంచి రూ.5 లక్షల విలువైన ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ లెటర్‌ను ఎమ్మెల్యే అందజేశారు.అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న సమయంలో ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచిన ఎమ్మెల్యే భూపతి రెడ్డికి నిక్లేష్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఖరీదైన వైద్య చికిత్స భారంగా మారుతున్న నేపథ్యంలో సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు పేర్కొన్నారు

## మంథనిలో కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలన ఘన సంబరాలు



**మంథని, సెప్టెంబర్ 07, (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా మంథని మండలంలో సంబరాలు అంబరాన్ని అంటాయి. మండల పార్టీ అధ్యక్షులు అయిలి ప్రసాద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోలు శివ ఆధ్వర్యంలో మంథనిలో ఘనంగా నిర్వహించారు. ప్రజా సంక్షేమం అభివృద్ధి రైతు సంక్షేమం యువతకు అవకాశాలు అనే లక్ష్యాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల్ పార్టీ అధ్యక్షులు అయిలి మంథని మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్,వ్యవసాయ కమిటీ చైర్మన్ కూడుదుల వెంకన్న, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఎలక్ట్రిసిటీ బోర్డు మెంబెర్ శశిభూషన్ కాచే,ఎస్సి సెల్ డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం, ఎస్సి సెల్ మండల్ అధ్యక్షులు మంథని రాకేష్, మాజీ మార్కెట్ చైర్మన్ ఉప్పట్ల శ్రీనివాస్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎరుకల ప్రవీణ్, నూకల బాణయ్య,అజీమ్ ఖాన్ ,గుంజ పడుగు సర్పంచ్ దండవేన సంధ్య, మున్సిపల్ కౌన్సిలర్లు, గ్రామ సర్పంచ్ లు, గ్రామ ఉప సర్పంచ్ లు, మాజీ ప్రజాప్రతినిధులు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయుకులు, వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అన్ని విభాగల నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేటీఆర్ అరెస్టుకు నిరసనగా ప్రజావాణిలో ఎంపీడీవోకు ఫిర్యాదు



**సెప్టెంబర్ 07, (జనంసాక్షి)**కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని పైన చర్యలు తీసుకోవాలని వినపత్రం అందజేతఇందూరు నేత్రం,అందరివాయి ప్రజలకు అత్యవసరంగా పరిష్కరించాల్సిన సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు, అలాగే భూముల సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతుల ప్రధాన సమస్యలపై అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీసేందుకు వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మెల్యేలు నల్ల దుస్తులు ధరించి అసెంబ్లీకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఇందల్వాయి మండల దీ=వా నాయకులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.రైతులు ఎదుర్కొంటున్న భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, అర్హులైన రైతుల భూములను జాబితా నుంచి తొలగించి వారికి న్యాయం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.అలాగే ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు వెళ్తున్న ప్రతిపక్ష నాయకులను అడ్డుకోవడం, అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని దీ=వా నాయకులు విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గౌడ్ మాజీ ఐడిసిఎంఎఎజిల్లా సీనియర్ నాయకులు పాశంకుమార్ అందల్వాయి మాజీ ఎంపీటీసీ మారంపల్లి సుధాకర్ తీర్మన్ పల్లి మాజీ ఎంపీటీసీ చింతల దాసు తదితర మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## కాంగ్రెస్ బీజేపీల వైఫల్యాలపై బీఆర్ఎస్ సమరభేరి



**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 7, ( జనం సాక్షి)**కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన వారం రోజుల నిరసన కార్యక్రమాలు కరీంనగర్‌లో ఉధృతమయ్యాయి. రాష్ట్ర పార్టీ పిలుపులో భాగంగా ఏడో రోజు నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ శ్రేణులు భారీ నిరసన నిర్వహిం చాయి. నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్లా హరిశంకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నగరంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా



చల్లా హరిశంకర్ మాట్లాడుతూ నగరంలో పాలనా వ్యవస్థ స్తబ్ధుగా మారిందని, అభివృద్ధి పనులు మందగించాయని విమర్శించారు. పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేక చెత్తాచెదారం పేరుకుపోతోందని ఆరోపించా రు. తాగునీటి సరఫరా కూడా సక్రమంగా జరగడం లేదని, మున్సిపల్ వ్యవస్థలో అవినీతి పెరిగిపోయిం దని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, కరీంనగర్ నగరపాలక సంస్థలో బీజేపీ పాలన కలిసి నగర అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తున్నాయని హరిశంకర్ ఆరోపిం చారు. గత బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులతో పోలిస్తే ప్రస్తుత పాలనలో నగరానికి కొత్తగా చెప్పుకోదగ్గ అభివృద్ధి కనిపించడం లేదన్నారు. ప్రజలు కాంగ్రెస్, బీజేపీలపై నమ్మకం కోల్పోయారని, సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నాయకులు, కార్పొరేటర్లను ఆశ్రయి స్తునారని పేర్కొన్నారు .ప్రజలకు అండగా బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని ఆయన తెలిపారు. అనంతరం నగరపాలక సంస్థ ప్రజావాణిలో 66 డివిజన్లకు సంబంధించిన వివిధ సమస్యలపై వినతిప_త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణరావు, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# యూరియా కొరతపై రోడ్డెక్కిన రైతులు

## కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై బీఆర్ఎస్ నేతల నిరసన



**గంభీరావుపేట, సెప్టెంబర్ 7 జనంసాక్షి:** రైతులకు సకాలంలో ఎరువులు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామ సర్పంచ్ ఎడబోయిన దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి, అవసరమైన మేరకు యూరియాను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. వరి నాట్లు వేసి దాదాపు రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ పంటలకు అవసరమైన యూరియా సక్రమంగా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు. యూరియా కోసం రైతులు రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్మార్ట్‌ఫోన్ వినియోగంపై అవగాహన లేని రైతులు ఆన్‌లైన్ బుకింగ్ తదితర ప్రక్రియల కారణంగా మరింత ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

**రైతుల కష్టాలను ప్రభుత్వం అర్థం చేసుకోవాలి**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి రైతుల సమస్యలను అర్థం చేసుకోవాలని, పంటలకు అవసరమైన ఎరువులను సకాలంలో అందించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రైతాంగానికి ఏ సమస్య వచ్చినా భవిష్యత్తు లో బీఆర్ఎస్ పార్టీ రైతన్నకు అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి సమీపంలో ఉన్న ఎగువ మానేరు ప్రాజెక్టులోకి ఎండాకాలంలో సైతం కాళేశ్వరం జలాలను తీసుకువచ్చి, వానాకాలం, యాసంగి రెండు పంటలకు సాగునీరు అందించిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ప్రస్తుతం మానేరు ప్రాజెక్టులో నీరు ఉన్నప్పటికీ రైతులకు సక్రమంగా సాగునీరు అందించలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. రైతులకు ఎరువులు, సాగునీరు సకాలంలో అందించి పంటలను కాపాడాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు

# కంటి అద్దాల పంపిణీ

**వేములవాడ, సెప్టెంబర్ 07 (జనంసాక్షి):** వేములవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్ బి ఎస్ కె) ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారుల బృందం పాఠశాలలోని 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రక్త, నేత్ర పరీక్షలతో పాటు ఎత్తు, బరువులను కొలిచి ఆరోగ్య వివరాలను నమోదు చేసుకుంది. పరీక్షల్లో దృష్టిలోపంతో ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించిన పలువురు విద్యార్థులకు ఉచితంగా కళ్ళజోళ్లను అందజేశారు. విద్యార్థులు చిన్నతనంలోనే కంటి సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఈ సందర్భంగా వైద్యులు సూచించారు.?ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రభాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజారత్నం, ఉపాధ్యాయులు మల్లేశం, కోటేశ్వర్, సలాం, హమీద్, చంద్రమౌళి, జ్యోతి, శిరోమణి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# సిరికొండ గ్రామంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం

**కథలాపూర్ సెప్టెంబర్ 7 (జనంసాక్షి)**



కథలాపూర్ మండలంలోని సిరికొండ గ్రామంలో సర్పంచ్ ముదం రవి అధ్యక్షతన, ఉప సర్పంచ్ చిట్యాల మల్లయ్య మరియు వార్డు సభ్యుల సహకారంతో కథలాపూర్ వైద్యాధికారి డాక్టర్ పి. సిందూజ ఆధ్వర్యంలో వారి సిబ్బందితో మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగినది. ఈ క్యాంపులో జ్వరంతో బాధపడుతున్న ముగ్గురుకి మాత్రమే పంపించడం జరిగినది. బిపి పేషెంట్లు మరియు షుగర్ తో బాధపడుతున్న పేషంట్లను ప్రత్యేక చికిత్సలు అందించి వారికి ఆహారపు అలవాట్ల గురించి వివరించి చెప్పడం జరిగినది. పరిసరాల పరిశుభ్రం గురించి మరియు వ్యక్తిగత పరిశుభ్రతం గురించి మరియు నిలకడగల నీళ్లపై దోమల అభివృద్ధి విధానం గురించి చిన్న చిన్న కొబ్బరి చిప్పలు గాని పగిలిపోయిన కుండలు గాని చిన్న చిన్న కాంటెండర్లు లార్వా అభివృద్ధి గురించి లార్వ అభివృద్ధి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగినది. ఈ మెడికల్ క్యాంపునకు 116 మంది హాజరు కాగా దాదాపు 18 మంది షుగర్ పేషంటు 27 మంది బిపి పేషెంట్లు లకు సేవలందించడం జరిగినది. ఈ మెడికల్ క్యాంపులో హాజరైన సిబ్బంది వివరములు డాక్టర్ పి.సింధూజ మెడికల్ ఆఫీసర్. టి. వేణుగోపాల్ సిహెచ్ఓ ఈ. మమత ఎంఎల్ హెచ్ పి పి మంజుల ఏఎన్ఎం అన్నపూర్ణ, రత్న ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



# హామీలు అమలు చేయడం చేతకాదు..

## ప్రశ్నిస్తే అరెస్టులా?

> ప్రజల గొంతుకను అరెస్టులతో అణిచివేయలేరు
> బీజేపీ మండల అధ్యక్షులు కోడె రమేశ్

**గంభీరావుపేట, సెప్టెంబర్ 7 జనంసాక్షి;** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రశ్నించే వారిని అరెస్టులతో అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని బీజేపీ మండల అధ్యక్షులు కోడె రమేశ్ విమర్శించారు. విద్యార్థుల ఫీజు బకాయిల చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపిస్తూ బీజేపీ యువ మోర్చా చేపట్టిన శాంతియుత ధర్నాకు అనుమతి నిరాకరించడంతో, రాష్ట్ర బీజేపీ పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న తమను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారని తెలిపారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గడ్డమీద ప్రసాద్‌రెడ్డితో కలిసి తనను కూడా ముందస్తుగా అరెస్టు చేశారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని రమేశ్ అన్నారు. ప్రజల గొంతుకను అరెస్టులతో అణిచివేయలేరని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల కోసం ప్రశ్నిస్తాం.. ప్రజల కోసం పోరాడుతాం. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

### మండల విద్యాధికారి ఆధ్వర్యంలో..

### సాలూర మండల ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానం

**బోధన్, సెప్టెంబర్ 7 ( జనంసాక్షి ) :** సాలూర మండలం ఉత్తమ ఉపాధ్యాయులను సోమవారం మండల విద్యాశాఖ అధికారిని రాజీ మంజూష ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా సాలూర మండలంలో 11 మంది టీచర్స్ ని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి సన్మానించారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ, సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చి దిద్దే ప్రయత్నం చేస్తామని వాగ్దానం చేశారు. అలాగే ఈ అవార్డ్ తమ బాధ్యతను ఎంతో పెంచిందని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారిని మంజూష మాట్లాడుతూ, విద్యార్థులే మన ఆస్తి వారి సర్వతోముఖ అభివృద్దే మన లక్ష్యం అని తెలియచేస్తూ సన్మాన గ్రహీతలకు అభినందనలు తెలిపారు. సన్మాన గ్రహీతలు జి సాయిలు, కె విఠల్, ఎ రమ, పి సబిత కుమారి, ఏం అశోక్ కుమార్, పి గుణశ్యాం, వై జ్యోతి, ఏం అనురాధ, జె ఆష, ఎస్ గంగాధర్, మెహెర్ సుల్తానా లు ఉన్నారు.



కవ్వంపల్లి నోరు అదుపులో పెట్టుకోవాలి..

# అభివృద్ధి ఏంది అంటే..? బూతులా?

## బీఆర్ఎస్ హెచ్చరిక!

**గన్నేరువరం, సెప్టెంబర్ 07 (జనంసాక్షి):**



గన్నేరువరం మండల కేంద్రంలో రాజకీయ రగడ తారాస్థాయికి చేరింది. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌పై కాంగ్రెస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలు, దిష్టిబొమ్మ దహనానికి నిరసనగా సోమవారం బీఆర్ఎస్ శ్రేణులు తిరగబడ్డాయి. ఎమ్మెల్యే కవ్వంపల్లి దిష్టిబొమ్మను దహనం చేయడానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కవ్వంపల్లి తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. వైద్య వృత్తికి మచ్చ: డాక్టర్ వృత్తి నుంచి వచ్చి ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన ఎమ్మెల్యే కవ్వంపల్లి, బజారు భాష మాట్లాడుతున్నారంటూ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, నాయకుడు న్యాత సుధాకర్ ధ్వజమెత్తారు. శూన్య అభివృద్ధి: నియోజకవర్గంలో కవ్వంపల్లి చేసింది సున్నా అభివృద్ధి అని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే గెలిచేది పోయి ఆయన డిపాజిట్ గల్లంతు కావడం ఖాయమని ఎద్దేవా చేశారు. హెచ్చరికలు: అలువాల కోటి సహా కాంగ్రెస్ నాయకులు తమ పద్ధతి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని, “ఏ చేత్తో మీరు చూపించారో, అవే చేతులు మాకు కూడా ఉన్నాయి” అంటూ ఘాటుగా హెచ్చరించారు. ప్రజావాణిలో దరఖాస్తులు: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు.. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో ప్రజలను ఆగం చేస్తోందని విమర్శిస్తూ, అమలు కాని హామీలపై వందకు పైగా దరఖాస్తులను ప్రజావాణిలో అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మీసాల ప్రభాకర్, కొట్టే భూమయ్య, బోయిని బాలయ్య, పత్తి అంజి, బొడ్డు బాలయ్య, బోయిని పోషయ్య, సమ్మెట అనిల్, బొడ్డు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# తాత్కాలికంగా రోడ్డు మరమ్మతులు చేపట్టాలి..

## యువజన సంఘాల నాయకులు డిమాండ్..



**గన్నేరువరం, సెప్టెంబర్ 07 (జనంసాక్షి):** గన్నేరువరం మండల కేంద్రంలో సోమవారం శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ లో యువజన సంఘం నాయకుల ఆధ్వర్యం లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈనెల 14 న వినాయక చవితి వేడుకలు ఉన్నందున గునుకుల కొండాపూర్ నుండి గన్నేరువరం, పోత్తూరు వరకు పెద్ద పెద్ద గుంతలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వినాయక విగ్రహాలు ఆటోలో ట్రాక్టర్లో తీసుకు రావాలంటే భక్తులు ఇబ్బంది పడే అవకాశం ఉంది. ఆర్ అండ్ బి అధికారులు, రెవెన్యూ అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి వినాయక చవితి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని గుంతలను మట్టితో పూడ్చాలని యువజన సంఘాల నాయకులు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కాల్వ నాగరాజు కోరుతున్నారు. గత పది రోజుల క్రితం యువజన సంఘాల ఆధ్వర్యంలో రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలని కోరినప్పటికీ ఇప్పటివరకు ఎమ్మెల్యే స్పందించలేదని మండిపడ్డారు. రానున్న రెండు రోజుల్లో యువజన సంఘాల ఆధ్వర్యంలో కార్యచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఎలాంటి మరమ్మత్తులు చేపట్టకపోతే వినాయకుని చవితికి ముందే యువజన సంఘాలతో పాటు మండల కుల సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేయడానికి సిద్ధమని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గన్నేరువరం వార్డు సభ్యులు మచ్చ సాయి కృష్ణ,యువజన సంఘాల నాయకులు సందవేణి ప్రశాంత్, గూడూరి సురేష్, తిప్పర్తి ప్రవీణ్, గంట గౌతమ్, రంగనవేణి శ్రీనివాస్, రంగనవేణి దేవరాజ్, నరేష్, కుంభం మహేష్, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# అసెంబ్లీలో వేయి రోజుల పాలనను నిలదీస్తరనే అడ్డుకున్నరు

**మంథని, సెప్టెంబర్ 07, (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఇందిరమ్మ పాలన చేస్తామని చెప్పి ఈనాడు 1972లో ఏ విధంగా ఎమర్జెన్సీ రోజులను తలపించేలా పాలన ఉందని, మళ్లీ చీకటి రోజులు కన్పిస్తున్నాయని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వేయి రోజుల పాలనపై బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల దుస్తులతో అసెంబ్లీలోకి వెళ్తేంటే అడ్డుకుని అరెస్ట్ చేయడం, మహిళలైన సునీత లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డిలపై పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ మంథని పాత పెట్రోల్ బంక్ సమీపం లోని పెద్దపల్లి కాటారం ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల గొంతుకై వేయి రోజుల కాంగ్రెస్ పాలనపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీలో ఎక్కడ నిలదీస్తారోననే భయంతో అడ్డు కున్నారని, మహిళలని చూడకుండా చిత్రహింసలకు గురి చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. పోలీసులను అడ్డు పెట్టుకుని ఎన్ని ఇబ్బందులు పెట్టినా బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాటం చేస్తూనే ఉంటుందని రేవంత్‌రెడ్డి గమనించా లన్నారు. వేయి రోజులు అవకాశం ఇస్తే వేల కోట్లు సంపాదించుకున్నారని, రేవంత్‌రెడ్డి క్యాబినెట్ కూడా వేలకోట్లకు పడగలు ఎత్తారే తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని ఆరోపించారు. ఇందిరమ్మ పాలన అంటే ఇంత దౌర్భాగ్యమైన పాలనా అని పెద్దలు అంటున్నారని, ఆనాటి



○ మహిళలని చూడకుండా చిత్రహింసలకు గురి చేయడం సిగ్గు చేటు
○ ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుండ్లు
○ మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

ఎమర్జెన్సీ చీకటి పాలనను మళ్లీ చూస్తున్నామని సీనియర్లు చెబుతున్నారని అన్నారు. ఆరు గ్యారెంటీ లు వంద రోజుల్లో, 420 హామీలు ఐదేండ్లలో చేస్తామని చెప్పారని, ఆరు గ్యారెంటీల్లో ఒక్కటి అమలుకాలేదని, దీనిపై దృష్టి పెట్టాల్సిన రేవంత్‌రెడ్డి ప్రతిపక్షాలపై కుట్రలు చేస్తూ డైవర్షన్ పాలిటిక్స్‌లో నిమగ్నమయ్యారని దుయ్యబట్టారు. ఎంతసేపు పోలీసులు, డబ్బు సంచులను వాడుకుని మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని సబ్బండ వర్గాలకు అర్థం అయిందని, ఇక మీ ఆటలు సాగవన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఏదో ఒక కొత్త పథకమో, సంక్షేమమో, గొప్ప కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లారని, కానీ కాంగ్రెస్సోళ్లు మాత్రం ఢిల్లీకి కప్పం కట్టేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు పోటీ పడుతున్నారని ఎద్దేవా చేశారు. నేను ఇక్కడ దోచుకుంటా మీరు అక్కడ దోచుకోమని అంటు న్నాడని, భద్రాచలం ఎమ్మెల్యే పీఏ కోట్ల రూపాయలు సంపాదించుకున్నాడని పత్రికల్లో వచ్చిందని, మంథని ఎమ్మెల్యే పీఏలు, అనుచరులు, కార్యకర్తలు ఏ విధంగా సంపాదించు కుంటు న్నారో అర్థం అవుతుందని అన్నారు. ప్రజాపాలన పేరిట సాగిస్తున్న చీకటి పాలనపై బీఆర్ఎస్ పార్టీ అలుపెరుగని పోరాటం చేస్తుందని, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజల పక్షాన పోరాటం చేస్తారన్నారు. ఢిల్లీ పార్టీలైన కాంగ్రెస్ బీజేపీలు ఎన్నడూ తెలంగాణ రాష్ట్రం కోసం ఆలోచించలేదని, కేంద్రంలో ఈనాడు అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రానికి ఇప్పటి వరకు ఐదు పైసలు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వ పాలకులు కళ్లు తెరవాలని,బీఆరెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీలకు రానీయకపోతే గడపగడపకు తిరుగుతాం, ఇంటింటికి పోతామని, అందరిని అప్రమత్తం చేస్తామని, రెండేళ్ల కాలంలో ప్రజలను చైతన్యం చేసి మీ ఆరాచకాలను వివరిస్తామన్నారు.



## ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలంటూ బిఆర్ఎస్ నాయకుల వినతి పత్రం

**మల్యాల సెప్టెంబర్ 7 (జనంసాక్షి)** అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపిస్తూ మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు జనగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని బ్లాక్ చౌరస్తా వద్ద గల డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించి అనంతరం ర్యాలీగా వెళ్లి ప్రజావాణిలో నిరసన వ్యక్తం చేసి ఎంపీడీవో కు వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఇకనైనా కాలయాపన చేయకుండా అమలు చేసి,పేదలు, రైతులు,మహిళలు, విద్యార్థులు,నిరుద్యోగులు, వృద్ధులు, వికలాంగులకు ఆర్థిక భరోసా కల్పించాలని బిఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనగం శ్రీనివాస్, అయిలనేని సాగర్ రావు,తాటిపాముల రాజేందర్, మిట్టపల్లి దశరథం,బద్దం తిరుపతి రెడ్డి, మధుసూదన్ రావు,అనిల్ రెడ్డి, దొంతరవేణి శేఖర్, ఎండి. సలీం, లచ్చయ్య, శ్రీలత, పుష్పలత,స్వామి గౌడ్,మల్లారెడ్డి,త్రినాథ్,మరియు మండల బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రజావాణి కార్యక్రమానికి మూడు దరఖాస్తులు ఎంపీడీవో దివ్యదర్శనరావు

**సుల్తానాబాద్,సెప్టెంబర్ 07 (జనంసాక్షి) :** సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమానికి, సోమవారం మూడు దర ఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో దివ్యదర్శనరావు తెలిపారు. సోమవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని ఎంపీడీవో దివ్యదర్శనరావు నిర్వహించగా, తహసీల్దార్ బషీరుద్దీన్, ఏవో పైడితల్లి, ఎంఈఓ ఆరెపల్లిరాజయ్య,ఏఈ, కిషోర్ తో పాటు,అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## లింగన్నపేటలో విద్యుత్ షాక్‌తో మేక మృతి

**గంభీరావుపేట సెప్టెంబర్ 7 జనం సాక్షి;** గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలో విద్యుత్ షాక్కు గురై మేక మృతి చెందింది. గ్రామానికి చెందిన మోతే నర్సింహులు తండ్రి మల్లయ్య మేకల కాపరి ప్రతిరోజులాగే పెద్దకాలువ కట్టపై మేకలను మేపుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు తెగిపడి ఉన్న విద్యుత్ వైరు వద్దకు మేక వెళ్లడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. సాయంత్రం మందను ఇంటికి తీసుకెళ్లే సమయంలో మేక కనిపించకపోవడంతో వెతకగా విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు గుర్తించారు. మేక విలువ సుమారు రూ. 26 వేల వరకు ఉంటుందని యజమాని తెలిపారు. సమాచారం అందుకున్న వెటర్నరీ వైద్యులు సంఘటనా స్థలానికి చేరుకుని మేకకు పంచనామా నిర్వహించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ నాయకుడు జోగు సురేష్ మాట్లాడుతూ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే మేక మృతి చెందిందని ఆరోపించారు. విద్యుత్ అధికారులు స్పందించి బాధిత మేకల కాపరికి నష్టపరిహారం అందించాలని ఆయన కోరారు.





## ప్రజావాణికి 8 దరఖాస్తులు..

### పెండింగ్ దరఖాస్తులను వచ్చే వారం నాటికి పరిష్కరిస్తాం: ఎంపీడీవో రాజేందర్

**గంభీరావుపేట, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో రాజేందర్ అధ్యక్షతన ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొనగా మండలంలోని ప్రజలు తమ సమస్యలపై అధికారులకు దరఖాస్తులు సమర్పించారు. ఈ ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు 2, పంచాయతీరాజ్‌కు 3, హౌసింగ్‌కు 1, ఆర్‌డబ్ల్యూఎస్‌కు 1, డీఆర్‌డీఏకు 1 చొప్పున మొత్తం 8 దరఖాస్తులు అందాయి. ప్రజావాణి ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు మొత్తం 38 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో రాజేందర్ తెలిపారు. వీటిలో 12 దరఖాస్తులను పరిష్కరించగా, మరో 8 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వచ్చే వారం నాటికి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మారుతిరెడ్డి, ఏవో సల్లావుద్దీన్, ఏఈ ఆనంద్, సాంఘిక సంక్షేమ అధికారి భూదేవి, ఎంఈవో గంగారాం తదితర అధికారులు పాల్గొన్నారు.

# టిఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టులు..

## రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకొండ చందర్..

**గోదావరిఖని, జనంసాక్షి :** కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనా వైఫల్యాలను ఎండగడుతూ, ప్రజా సమస్యలపై గొంతు విప్పేందుకు అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్), మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావులతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకుని అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తీవ్రంగా ఖండించారు. మహిళా ప్రజాప్రతినిధులైన సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ ఆయన నాయకత్వంలో గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ ధర్నా నిర్వహించారు. ?ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శల దాడి చేశారు. తెలంగాణ ప్రజల గొంతుకై వేయి రోజుల కాంగ్రెస్ దుర్మార్గపు పాలనపై బీఆర్ఎస్ నాయకులు అసెంబ్లీలో ఎక్కడ నిలదీస్తారోననే వణుకుతోనే సీఎం రేవంత్‌రెడ్డి పోలీసులను అడ్డుపెట్టుకుని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని దుయ్యబట్టారు. అసెంబ్లీలో కాంగ్రెస్ 1000 రోజుల వైఫల్యాలను ఎండగడతారనే భయంతోనే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, ఇతర ప్రజాప్రతి నిధులను అసెంబ్లీ గేటు వద్దే పోలీసులు దాడి చేసి అడ్డుకున్నారని మండిపడ్డారు. మహిళా ఎమ్మెల్యేలని కూడా చూడకుండా పోలీసులతో చిత్రహింసలకు గురిచేయడం ఈ ప్రభుత్వ అహంకారానికి, అణచివేత ధోరణికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో మూల విజయా రెడ్డి, హరీష్ రెడ్డి, కౌశిక్ గౌడ్, మాదాసు రామ్మూర్తి, మేకల సమ్మయ్య యాదవ్,దేవరాజు, బొడ్డు రవి, జెవి రాజు, పద్మజ, తౌకల రమేష్, మందల కిషన్ రెడ్డి, బోడిపల్లి శ్రీనివాస్, దుమ్మెటి వాసు, చింటూ, శ్రావణ్, శ్రీకాంత్,వేణు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన తాళ్లపల్లి

**సుల్తానాబాద్,సెప్టెంబర్ 07 (జనంసాక్షి) :** ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని బీసీ సంక్షేమ సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి మనోజ్ గౌడ్,సోమవారం తెలంగాణ భవన్ లో మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తాళ్లపల్లి మనోజ్ గౌడ్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ రానున్న రోజులలో మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని రాజకీయ రంగంలో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని కోరారు.



# హామీలు అమలు చేయాలంటూ బిఆర్ఎస్ నాయకులు రోడ్డుపై బైఠాయింపు



**రుద్రంగి సెప్టెంబర్ 7 (జనంసాక్షి)**
కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలు,13 డిక్లరేషన్లు, 6 గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిందని,100 రోజుల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని చెప్పి వెయ్యి రోజులు పూర్తి అయినా ఇప్పటి దాకా ఒక్క హామీ పూర్తిగా అమలు కాలేదని ఆందోళన వ్యక్తం చేస్తూ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దేగవత్ తిరుపతి,గ్రామ శాఖ దయ్యాల కమలాకర్ ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతి పత్రం అందజేసి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. వెంటనే స్థానిక ఎస్సై మోతిరం సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని రోడ్డుపై బైఠాయించిన టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలను అక్కడి నుండి పంపించి ట్రాఫిక్ కి ఇబ్బంది కలగకుండా చూశారు. ఈ వారు మాట్లాడుతూ... బాధితులు ఎంపీడీవో నటరాజ్ కు వినతి పత్రం అందజేశామని,తమ కుటుంబంలోని అర్హులకు ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రయోజనాలు వెంటనే అందించాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు,అలాగే రుద్రంగిలో పారిశుద్ధ్య నిర్వహణ ఆగిపోయి మురికి కంపులో మునిగిపోయాయి.వెంటనే పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలి.ప్రభుత్వ హామీలను అడిగితే అక్రమ కేసులు పెడుతున్నారనీ, వీటిని వీటిని ఆపాలని,మా కుటుంబంలోని అర్హులైన ప్రతి సభ్యుడికి ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీల ప్రకారం ప్రయోజనాలు అందించాలని కోరుతున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు గంగ మహేష్, కంటే రెడ్డి, ఉప్పులూటి గణేష్, చెప్యాల గణేష్, మంచే రాజేశం, దయ్యాల నారాయణ, లక్కాకుల రమేష్, అంబటి రాములు,0 మోహన్, గజల్ లల్, పెద్దలు, దుబ్బ రవి, తదితరులు పాల్గొన్నారు.

# డి ఏ పి ఎరువులకు లింకులు పెట్టవద్దు

**సర్పంచ్ బద్ధం మహేందర్ ఎంపీడీవో కీ వినతి పత్రం**




**కథలాపూర్ సెప్టెంబర్ 7 (జనంసాక్షి)**
కథలాపూర్ మండలంలోని డి ఏ పి ఎరువులకు లింకులు పెట్టి అమ్ముతున్నారు యూరియా మండలంలోని ఎక్కడ దొరకడం లేదు . మండల వ్యవసాయాధికారికీ చాలాసార్లు విన్నవించిన చర్యలు తీసుకోలేక పోవడం చాలా బాధాకరం అని రైతులు తెలియజేశారు ఇట్టి ప్రైవేట్ ఎరువులు దుకాణాలను పరియావే క్షించడం లేదు సహకార సంఘాల్లో యూరియ నిల్వలు కేటాయించడం లేదు ప్రైవేట్ దుకాణాలకు ప్రోత్సహిస్తున్నారని ఎంపీడీవో కి భూషణరావుపేట గ్రామ సర్పంచ్ బద్ధం మహేందర్ రెడ్డి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.సహకార సంఘాలకు యూరియా ను కేటాయించి వ్యవసాయ అధికారులు నిత్యం ఎరువుల దుకాణాలను పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని తెలియజేశారు.

# ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన శంకుస్థాపనకు కరీంనగర్‌లో సన్నాహక సమావేశం

**కరీంనగర్ క్రైమ్, సెప్టెంబర్ 7 ( జనంసాక్షి ) :**
హైదరాబాద్ ఉప్పల్ భగాయత్‌లో జరగనున్న ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన శంకుస్థాపన మహోత్సవానికి సంబంధించి కరీంనగర్‌లోని స్థానిక తారక హోటల్‌లో కన్న కృష్ణ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉప్పల్ భగాయత్‌లో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభకు కేటాయించిన స్థలంలో ఈ నెల 13 తేదీన ఆదివారం ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన సముదాయ నిర్మాణానికి భూమి పూజ మహోత్సవం మరియు శ్రీనివాస కళ్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందని పేర్కొన్నారు.?ఈ మహోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానుండగా, పలువురు రాష్ట్ర మంత్రులు, ఆర్యవైశ్య ప్రముఖులు, రాజకీయ ప్రముఖులు విచ్చేయనున్నారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి ఆర్యవైశ్య సోదర, సోదరీమణులందరూ విశేష సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.





## వీణవంక లో కాంగ్రెస్ హామీలపై బిఆర్ఎస్ శ్రేణులు

# ప్రజావాణిలో ఫిర్యాదు

**వీణవంక సెప్టెంబర్ 7 (జనంసాక్షి)**
భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు వారం రోజులుగా,కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనకు వ్యతిరేకంగా బిఆర్ఎస్ పార్టీ తెలంగాణలో నిరసనలు,ధర్నాలు,బైక్ ర్యాలీలు,రాస్తారోకోలు,సోమవారం చివరి రోజున ఎన్నికల హామీలపై ప్రజావాణిలో ఫిర్యాదులతో ఎంపీడీవో కార్యాలయంలో కాంగ్రెస్ పై ఫిర్యాదు చేశారు.బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని,కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలని అన్నారు.కాంగ్రెస్ హామీలను ఇచ్చి మోసం చేసిందని,గ్రామాలలో పలు సమస్యలపై వీణవంక మండలంలోని బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ప్రజావాణిలో ఫిర్యాదులు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుకా తిరుపతిరెడ్డి,మాజీ జెడ్పిటిసి వనమాల సాధవ రెడ్డి,వైస్ ఎంపీపీ లత శ్రీనివాస్,వీణవంక గ్రామ సర్పంచ్ దాసరపు సరోజన రాజేంద్ర ప్రసాద్,గ్రామాల సర్పంచులు జడల రమేష్,మ్యాడగోని తిరుపతి,సంపత్ రెడ్డి,ఉప సర్పంచ్ తాళ్లపల్లి మహేష్ గౌడ్,బిఆర్ఎస్ నాయకులు కామిడీ శ్రీనివాస్ రెడ్డి, వడ్డేపల్లి భూమయ్య, చెక్క బండి శ్రీనివాస్ రెడ్డి,కాసర్ల సుధాకర్, ప్రజాప్రతినిధులు,బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## డిప్యూటీ సీఈఓగా పదోన్నతి పొందిన

# ఎంపిడిఓకు గణ సన్మానం సన్మానం

**గంగాధర సెప్టెంబర్ 07(జనంసాక్షి):**
కరీంనగర్ డిప్యూటీ సిఈఓగా పదోన్నతి పొందిన గంగాధర ఎంపిడిఓ దమ్మని రామును సోమవారం సర్పంచులు మాజీ సర్పంచులు బిఆర్ఎస్ నాయకులు శాలువాలతో గణాంగా సన్మానించారు.భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందుకొని ప్రజలకు సేవ చేయాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిలుముల సుధాకర్.మాజీ సర్పంచులు మెచినేని నవీన్ రావు.వేముల దామోదర్.మడ్లపెల్లి గంగాధర్.జోగు సాగర్.బొల్లాడి శ్రీనివాస్ రెడ్డి.వడ్లూరి ఆదిమల్లు. బిఆర్ఎస్ నాయకులు ఆకుల మధుసూదన్.ద్యావ మధుసుదన్ రెడ్డి.మామిడి అఖిల్.గంగాధర నగేష్.పొన్నం రాములు.పరిశరాములు తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధిని అడ్డుకోవడమే బీఆర్ఎస్, బీజేపీ లక్ష్యం

◆ రుద్రంగి కాంగ్రెస్ నేతలు

**రుద్రంగి సెప్టెంబర్ 7 (జనంసాక్షి)**
ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్,బీజేపీ నేతలు విమర్శలు చేస్తున్నారని రుద్రంగి కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు.మండల అధ్యక్షుడు ఎర్రం గంగనర్సయ్య ఆధ్వర్యంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ చేలుకల తిరుపతి, సర్పంచ్ గండి నారాయణ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి ప్రజలందరికీ తెలుసని,బీజేపీ నేతలు రుద్రంగికి ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రశ్నించారు.రేషన్ కార్డుల పంపిణీలో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినా బీజేపీ నేతలే గొడవకు దిగారని అన్నారు.బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యమని,కాంగ్రెస్ హయాంలో మూడేళ్లలోనే రుద్రంగి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాడిశెట్టి అభిలాష్, నాయకులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, గట్ల మీనయ్య, సామ మోహన్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్, కొమిరె శంకర్, పల్లి గంగాధర్ తోపాటు వార్డు సభ్యులు,పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్. ఎస్ అన్వర్



**కమాన్ పూర్, సెప్టెంబర్ 07, (జనంసాక్షి) :**
తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు కమాన్ పూర్ మండలం గొల్లపల్లి గ్రామంలో నిర్మించిన నూతన ఇందిరమ్మ సోమవారం ఘనంగా ప్రారంభించారు. గ్రామానికి చెందిన లబ్ధిదారులు అరకంటి సౌందర్య- అంజి కు మంజూరైన ఈ ఇందిరమ్మ ఇంటిని కమాన్ పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్ ఎస్ అన్వర్ లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.అనంతరం లబ్ధిదారులను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో పేద ప్రజల సొంతింటి కలలు సాకారమవుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతలవారీగా ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి సర్పంచ్ షీలారపు మల్లయ్య , కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ శేవ్వా శంకరయ్య, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మల్యాల మహేష్ గౌడ్, చాట్ల గట్టయ్య, ఉప సర్పంచ్లు ఒడ్నాల శ్రీనివాస్, కొత్తపల్లి సతీష్, గడ్డం రాజా మహేందర్, చొప్పరి శేఖర్ , మహమ్మద్ రఫీక్ సోహెల్,ముత్యం శ్యాంసుందర్ , అంబిర్ రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికి ఇంకుడు గుంత తప్పనిసరి

**గుండారం సర్పంచ్ జంగిలి పోచాలు**



**కమాన్ పూర్, సెప్టెంబర్ 07, (జనంసాక్షి) :**
పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలం గుండారం గ్రామంలోని ఆమ్లెట్ విలేజ్ అయిన రాజాపూర్ గ్రామంలో సోమవారం ఇంటింటికి ఇంకుడు గుంతల నిర్మాణానికి గాను సర్పంచ్ జంగిలి పోచాలు చేతుల మీదుగా ముగ్గు పోసే కార్యక్రమం చేపట్టారు. ఇంకుడు గుంతల నిర్మాణంతో ఇంట్లోని మురికి నీరు బయటకి పోకుండా ఉండడంతో పాటు భూగర్భ జలాలు పెరుగుతాయని సర్పంచ్ ఈ సందర్భంగా తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతను నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అంబీరు రాజేందర్, కార్యదర్శి బి. ప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ ప్రాంతీయ కేంద్రంలో డేటా విశ్లేషణ శిక్షణ




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 7 (జనం సాక్షి):** తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) నిజామాబాద్ ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో 45 రోజుల డేటా విశ్లేషణ శిక్షణ కార్యక్రమానికి రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణలో ఎక్సెల్, డేటా ప్రాథమిక అంశాలు, డేటా విశ్లేషణ కోసం ఎస్క్యూఎల్, పైథాన్, నంపై, పాండాస్, డేటా దృశ్యీకరణ, పవర్ బీఐ, తుది ప్రాజెక్టు, ఉద్యోగ సాధన నైపుణ్యాలు, సామర్థ్య పరీక్షలు, తార్కిక ఆలోచన, ప్రవర్తనా మరియు సాఫ్ట్ స్కిల్స్ వంటి అంశాలపై శిక్షణ అందించనున్నారు. శిక్షణలో అంశాలపై అవగాహనతో పాటు ప్రయోగాత్మక కంప్యూటర్ శిక్షణ, అభ్యాస పనులు, ప్రశ్నావళి, మూల్యాంకనాలు నిర్వహిస్తారు. సామర్థ్య పరీక్షలు, ప్రవర్తనా మరియు వ్యక్తిత్వ వికాస శిక్షణ అంశాలను కార్యక్రమం చివరి దశలో నిర్వహించనున్నారు. శిక్షణ ప్రారంభ తేదీ: సెప్టెంబర్ 15కోర్సు వ్యవధి: 45 రోజులుకోర్సు ఫీజు: రూ. 1,999వేదిక: టాస్క్ ప్రాంతీయ కేంద్రం, ఐటీ టవర్, నిజామాబాద్ సంప్రదించవలసిన ఫోన్: 7013675052డేటా విశ్లేషణ రంగంలో ఉద్యోగ అవకాశాలకు అవసరమైన ప్రయోగాత్మక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలనుకునే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టాస్క్ నిజామాబాద్ ప్రాంతీయ కేంద్రం అధికారులు కోరారు.

## మాటలు ఎన్నో.. హామీలు ఎన్నో.. అమలు మాత్రం శూన్యం!

### కాంగ్రెస్ బాకీ కార్డుతో ప్రజావాణిలో బీఆర్ఎస్ వినతి పత్రం



**సిరికొండ, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను 1000 రోజుల పాలనలో అమలు చేయలేదని ఆరోపిస్తూ సిరికొండ మండల బీఆర్ఎస్ నాయకులు సోమవారం ప్రజావాణిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రస్తావిస్తూ రూపొందించిన 'కాంగ్రెస్ బాకీ కార్డు'ను వినతి పత్రం గా తహసీల్దార్‌కు అందించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతు భరోసా, రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతి, కౌలు రైతులకు భరోసా, వరికి రూ. 500 బోనస్, విద్యా భరోసా, రైతు కూలీలకు ఆర్థిక సాయం, ఆటో కార్మికులకు హామీలు, మహాలక్ష్మి పథకం తదితర అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందని అన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తుంగలో తొక్కిందని విమర్శించారు. రైతులు, రైతు కూలీలు, నిరుద్యోగులు, కౌలు రైతులు, ఆటో కార్మికులు, మహిళలు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తు చేయడంతో పాటు, వాటిని అమలు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో భాగంగానే కాంగ్రెస్ బాకీ కార్డును అందజేస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, హామీల అమలు కోసం బీఆర్ఎస్ ప్రజల తరఫున నిరంతరం పోరాడుతుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సొసైటీ మాజీ చైర్మన్ గంగారెడ్డి, భూషణ్ రెడ్డి, చిన్న గంగారెడ్డి, కిషన్, ఆన్సర్, మోహన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, అరవింద్, సురేందర్ రెడ్డి, రాజారెడ్డి, ముత్యంతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## మహిళలకు ఉచిత కుట్టుమిషన్ ట్రైనింగ్ ప్రారంభం

### పెద్దమల్లారెడ్డి మహిళలకు సువర్ణ అవకాశం

**భిక్కనూరు సెప్టెంబర్ 07 (జనంసాక్షి);** భిక్కనూరు మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు స్వయం ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో అక్షయ రూరల్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని సోమవారం గ్రామ సర్పంచ్ కోడూరి సాయగౌడ్ ప్రారంభించారు, ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళలు కుట్టు మిషన్ ట్రైనింగ్ ద్వారా స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి అవసరమైన సహకారం అందిస్తున్న సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను అభి నందించారు, ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ చైతన్య కొండల్ రెడ్డి, వార్డు సభ్యులు వడ్ల శ్రీనివాస్ చారి, నట్ట లింగం, కంటి వసంత, గ్రామ పెద్దలు బాగారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, ఆర్గనైజింగ్ డైరెక్టర్ రజిత రెడ్డితో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## 420 హామీలు,6 గ్యారంటీలను అమలు చేయాలని బిఆరెస్ నాయకుల ధర్నా

### మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల అనుచిత ప్రవర్తనను ఖండిస్తున్నాం :బిఆరెస్ నాయకులు



**మెట్ పల్లి, సెప్టెంబర్ 7(జనంసాక్షి)** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, 6 గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మెట్పల్లి పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం రెవిన్యూ డివిజనల్ అధికారి వినతి పత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, నిరుద్యోగులు, పేదలు, వృద్ధులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అదేవిధంగా హైదరాబాద్‌లో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు సునీత లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి పోలీసులు అనుచితంగా ప్రవర్తించిన తీరును బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు సరికాదని, ఇటువంటి చర్యలను తక్షణమే నిలిపివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి పట్టణ, మండల బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ మారుసాయిరెడ్డి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బోయినపల్లి చంద్రశేఖర్ రావు, ఆకుల ప్రవీణ్, మొరపు తేజ, పురుషోత్తం, జియా, విష్ణు, రాజా గౌడ్, తిరుపతిరెడ్డి, కొండ్లేపు శ్యామ్, సుధాకర్ గౌడ్, శ్రీనివాస్, ప్రణయ్, హరీష్, సత్యం, హనుమాన్లు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణతో ఉపాధి బాట..19 మంది యువతుల ఎంపిక



**రాయికల్ సెప్టెంబర్ 7 జనంసాక్షి :** రాయికల్ పట్టణంలోని చిన్నజీయర్ స్వామి ట్రస్ట్ భవనంలో జీఎంఆర్, ప్రతిమ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హోమ్ ఎయిడ్ హెల్త్ కోర్సులో శిక్షణ పొందుతున్న 19 మంది నిరుద్యోగ యువతులను వరంగల్‌లోని ప్రతిమ క్యాన్సర్ ఆసుపత్రిలో ఉద్యోగ శిక్షణకు ఎంపిక చేసినట్లు ప్రతిమ ఫౌండేషన్ ఆర్గనైజర్ నాగిరెడ్డి రఘుపతి తెలిపారు. ఎంపికైన వారికి 45 రోజుల పాటు ఆసుపత్రిలో ఉద్యోగ శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం అర్హతను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రఘుపతి తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం హామీలపై ప్రజావాణిలో ఫిర్యాదు

### చౌరస్తాలో బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు నిరసన



**భిక్కనూరు సెప్టెంబర్ 07 (జనంసాక్షి):** భిక్కనూరు మండల కేంద్రంలో బి.ఆర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని పార్టీ సీనియర్ నాయకులు అందే మహేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ తునికి వేణు ముదిరాజ్, మాజీ ఉపసర్పంచ్ బోడ పుంటి నరేష్, సీనియర్ నాయకులు బోండ్ల రామచంద్రం ముదిరాజ్, సీనియర్ నాయకులతో కలసి ఎంపీడీవో సవితా రెడ్డికి వినతి పత్రం అందజేశారు, అనంతరం భిక్కనూరు చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు, ఈక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు పథకాల అమలు నోచుకోకుండా ఆటకెక్కాయి అని విమర్శించారు, ప్రజలను నమ్మించి ప్రజల ఓటుతో అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని ఎద్దేవా చేశారు, ప్రజలను మోసం చేస్తే సహించేది లేదని ప్రజలే సమయం వచ్చినప్పుడు ప్రభుత్వానికి వారి ఓటుతో సమాధానం చెప్తారని గుర్తు చేశారు, ఈసందర్భంగా మాజీ సర్పంచ్ తునికి వేణు ముదిరాజ్ మాట్లాడుతూ చౌరస్తాలో ఏర్పాటుచేసిన పైలెన్ కు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ముఖ్యంగా వాహనదారులకు అసౌకర్యం కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు, ఈఅంశంపై గ్రామపంచాయతీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఇకపై ఎలాంటి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వారు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 420 హామీలను నిలబెట్టుకోవాలి : మాజీ జెడ్పిటీసి మ్యాకల రవి



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 7 (జనంసాక్షి) :** అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వేములవాడ నియోజకవర్గం వ్యాప్తంగా బిఆర్ఎస్ నాయకులు ఎంపీడీవోలకు వినతి పత్రాలు అందజేశారు. సోమవారం వేములవాడ అర్బన్ మండల పరిషత్ కార్యాలయంలో మాజీ జెడ్పిటిసి మ్యాకల రవి ఆధ్వర్యంలో నాయకులు ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మ్యాకల రవి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. రైతులు, మహిళలు, యువతను ఓట్ల కోసం ఆచరణ సాధ్యం కాని హామీలతో మోసం చేశారన్నారు. రుణమాఫీ, ఆసరా పింఛన్ల పెంపు, రైతు భరోసా, నిరుద్యోగ భృతి వంటి ప్రధాన హామీలను ఎగ్గొట్టేందుకు కుంటి సాకులు చెబుతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి ఆర్ సి రావు తో పాటు బిఆర్ఎస్ పార్టీ అర్బన్ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మల్లాపూర్ నుంచి హైదరాబాద్ టీజీజేఏసీ సభకు ప్రత్యేక బస్సు

మల్లాపూర్, సెప్టెంబర్ 07(జనంసాక్షి)

టీజీజేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న సభకు మల్లాపూర్ మండలం నుంచి అత్యధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరయ్యేలా మండల ఉపాధ్యాయ సంఘాలు, జిల్లా బాధ్యుల ఆధ్వర్యంలో మల్లాపూర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సభకు మండలంలోని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా మల్లాపూర్ నుంచి ప్రత్యేకంగా ఒక బస్సును ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు నిర్ణయించాయి. ఉపాధ్యాయుల సమస్యలు, హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న ఈ సభను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ పాల్గొనాలని నాయకులు పిలుపునిచ్చారు. సమావేశం తుంగూరి సురేష్, అంబాటి భూమేశ్వర్, జంగ గంగాధర్యం బాల శ్రీనివాస్, బి. వంశీధర్ రెడ్డి. బందరికంటి శ్రీనివాస్. లావుద్యా రాజయ్య. మంగ నలిన్ కుమార్. దారవేని జీవన్. బబ్బూరి రాజేందర్, బింగి పరమేశ్వర్

## ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని నేడు ధర్నా. విజయవంతం చేయండి

**- మాతంగి రేవంత్, ఆవు నూరి సతీష్. శంకరయ్య**

సుల్తానాబాద్, సెప్టెంబర్ 07(జనంసాక్షి) :

కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ లో ఉన్న నిరుపేద విద్యార్థిని విద్యార్థుల ఫీజు రియంబర్స్ మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నేడు ధర్మసమాజ్ పార్టీ, బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ, జనసేన, జేఏస్పి, బి ఆర్ ఎస్ వి, టీ ఆర్ఎస్, వివిధ కుల సంఘాలు విద్యార్థి సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు, డి.ఎస్.పి జిల్లా కన్వీనర్ మాతంగి రేవంత్, జిల్లా నాయకులు ఆవునూరి సతీష్, ఎదుళ్ళ శంకరయ్య పిలుపునిచ్చారు. అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.



# భారతీయ జనతా పార్టీ నేతల అరెస్టు అక్రమం

వెల్గటూర్ సెప్టెంబర్ 07(జనం సాక్షి)

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ధర్మపురి పర్యటన సందర్భంగా బీజేపీ నాయకులను అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేసి, వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, రాత్రి 12 గంటల నుంచి ఉదయం వరకు నిర్బంధించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైనదని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండించింది. ప్రజాస్వామ్యం వ్యవస్థ లో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, ప్రజల సమస్యలపై గొంతెత్తడం ప్రతిపక్షాల బాధ్యత. అని ప్రశ్నించే గొంతులను అరెస్టులతో అణచివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తే అది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్న రు. ఉపముఖ్యమంత్రి పర్యటనకు ఎలాంటి ఆటంకం కలిగించకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనను తెలియజేసే హక్కు భారతీయ జనతా పార్టీ కి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామని చెప్పి, ఇప్పుడు ప్రతిపక్ష నాయకుల హక్కులను కాలరాయడం సమంజసమా అని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులు.. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపితే నిర్బంధాలు.. ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన ప్రజాపాలన అని ప్రశ్నించారు. అరెస్టులతో బీజేపీ గొంతును అణచలేరని, నిర్బంధాలతో ప్రజల సమస్యలను దాచలేరని ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు అందరికీ ఉంటుందని దీని కోసం బీజేపీ నిరంతరం పోరాడుతుందన్నారు. అరెస్ట్ అయిన వారిలో బిజెపి పట్టణ, మండల అధ్యక్షులు గాజు భాస్కర్, కుమ్మరి తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి లు తిరుమందాస్ సత్యనారాయణ, సంఘీ మాధవ్, బీజేవైఎం నాయకులు మండలోజీ సూరజ్, కాసరపు వెంకటేష్, సోషల్ మీడియా ఇన్చార్జి కాశెట్టి హరీష్ లు ఉన్నారు.

# తాత మధు, కేటీఆర్‌ల దిష్టిబొమ్మల దగ్ధం

### స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ ఆందోళన

ఇల్లంతకుంట సెప్టెంబర్ 07 (జనంసాక్షి)



శాసనసభ స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాత మధు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తాత మధు, కేటీఆర్‌ల దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి స్పీకర్‌పై అసభ్య పదజాలంతో వ్యాఖ్యలు చేయడం సరికాదని నాయకులు అన్నారు. ఎమ్మెల్సీ తాత మధును వెంటనే శాసనమండలి నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే చర్యలను కాంగ్రెస్ పార్టీ సహించబోదని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ముస్కానిపేట గ్రామ సర్పంచ్ కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఇల్లంతకుంట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఎం.రాజు, వల్లంపట్ల గ్రామ సర్పంచ్ నేరెళ్ల విజయ్, రేపాక గ్రామ సర్పంచ్ కాత మల్లేశం, బోటిమీదపల్లి గ్రామ సర్పంచ్ సుమను-శివాని, వార్డు సభ్యుడు రేగుల కార్తిక్, పాక్స్ డైరెక్టర్లు ఒగ్గు రమేష్, ఎలుక అనిల్, మానకొండూర్ నియోజకవర్గ మాజీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అనంతగిరి విజయకుమార్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలగందుల ప్రసాద్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మచ్చ రాజేశం, వీరేశం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంతగిరి బాలపోచయ్య, బాలరెడ్డి, హనుమంతరెడ్డి, బడుగు లింగం, న్యాత బాబు, శ్రీనివాస్, జమాల్, నరేందర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు తుమ్మ బాలు, దాసరి శివ, ఒగ్గు మధు, యాస నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.




## పోగొట్టుకున్న సెల్ ఫోను అందజేత

కరీంనగర్ క్రైమ్, సెప్టెంబర్ 7 (జనంసాక్షి ) :

నగునూరు గ్రామంలోని ప్రతిమ హాస్పిటల్ వద్ద భవ్య వాణి తన యొక్క ఆపిల్ ఐఫోన్ పోగొట్టుకొనగా కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినారు పోలీసులు సి.ఈ.ఐ.ఆర్ టెక్నాలజీ సహాయంతో పోగొట్టుకున్న సెల్ ఫోనును ట్రేస్ చేసి జగిత్యాల లో పట్టుకోవడం జరిగింది. ఫోన్ యజమాని భవ్యవాని కి ఇన్స్పెక్టర్ ఏ.నిరంజన్ రెడ్డి సెల్ ఫోను ను అందజేశారు సెల్ ఫోన్ ట్రేస్ చేయడంలో కృషి చేసిన టెక్ టీం కానిస్టేబుల్ చిట్యాల రాంసాయి, కీర్తన లను సిఐ ఏ. నిరంజన్ రెడ్డి అభినందించారు, అందజేసిన సెల్ ఫోన్ విలువ సుమారు లక్ష రూపాయలు వరకు ఉంటుంది.

## రైతుల నుండి ఛార్జీలు వసూలు చేసేందుకు అనుమతి ఇవ్వాలి జిల్లా కలెక్టర్ కు వినతి: సహకార సంఘం అధ్యక్షులు ఎస్ కె బాబా



బోధన్, సెప్టెంబర్ 7 ( జనంసాక్షి ) :

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు సరఫరా చేయు ఎరువుల నిమిత్తము ఈఊ FOL (Freight on Loss/Fertilizer Transport Charges) చార్జీలను రద్దు చేయడం జరిగిందని అందువల్ల రైతుల నుండే అదనపు చార్జీలు వసూలు చేసేందుకు అనుమతి ఇవ్వాలని సహకార సంఘం యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎస్ కె బాబా సోమవారం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందించారు. ఎరువుల రవాణ మరియు హమాలీల భారము సొసైటీల మీద పడటం వలన సొసైటీలకు ఒక లోడ్ లారీ వెనుకాల సుమారు 15వేయిల రూపాయలు నష్టం జరుగుతున్నదని కావున ఈ విషయమును సొసైటి యొక్క మనుగడను దృష్టిలో పెట్టుకొని, రైతుల వద్ద నుండి సొసైటీల ద్వారా అదనముగా ట్రాన్స్పోర్టు చార్జీలు మరియు హమాలీ చార్జీలను వసూలు చేసుకొనుటకు ఉత్తర్వులు జారి చేసి, సొసైటీలు నష్టపోకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట సహకార సంఘం కార్యదర్శులు శ్రీనివాస చారి, ఇతర కార్యదర్శులు ఉన్నారు.

## కేశవపట్నం వాగుపై బ్రిడ్జి నిర్మించాలని ప్రజావాణిలో వినతి

శంకరపట్నం సెప్టెంబర్7 జనంసాక్షి

శంకరపట్నం మండల కేంద్రంలోని కేశవపట్నం మల్లెపచ్చం వాగుపై బ్రిడ్జి నిర్మించి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతూ గ్రామస్తుడు కొత్తపేల్లి రవి సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. శంకరపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో అనితకు వినతిపత్రం అందజేశారు. కేశవపట్నం వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం స్థానిక ప్రజల చిరకాల కోరికగా ఉందని రవి పేర్కొన్నారు. వర్షాకాలంలో వాగు ప్రవాహం పెరిగిన సమయంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే కేశవపట్నంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడి రాకపోకలు సులభతరం అవుతాయని వివరించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వాగుపై శాశ్వత బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. ఈ అంశంపై అధికారులు సానుకూలంగా స్పందించి, సమస్యను పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు రవి తెలిపారు.



# ఎండపల్లి మండలంలో ప్రజావాణి

ఎండపల్లి, ప్రతినిధి జనం సాక్షి, సెప్టెంబర్ 7:

ఎండపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ) డి. కృపాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు, ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి మొత్తం 04 దరఖాస్తులు (అర్జీలు) స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు అందజేసిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఓఖఆా డి. కృపాకర్ సూచించారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజావాణి కార్యక్రమం ఒక ముఖ్యమైన వేదికగా ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి వివిధ శాఖలకు చెందిన మొత్తం 11 మంది అధికారులు హాజరయ్యారు. వీరిలో ఓఖఆా డి. కృపాకర్, తహసీల్దార్ కార్యాలయం నుంచి బి. అనసూర్య, మండల వ్యవసాయ శాఖ అధికారి కే. మహేష్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ మనోజ్ కుమార్, మండల విద్యాధికారి ఎస్. హరికృష్ణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్. శ్రీనివాస్, శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి (అఆఖా) ఎం. ఆండాలు, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి చి. మధుకర్, మండల హౌసింగ్ శాఖ ఏఈ ఎస్. గౌతమి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్/రేంజ్ ఆఫీసర్ ఇ. నరేష్, సహాయ







ఇంజనీర్ బి. సమ్మయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓఖఆా డి. కృపాకర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు బాధ్యతగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో శాఖల మధ్య సమన్వయం ఎంతో ముఖ్యమని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# తెలంగాణలో ప్రజా వ్యతిరేక పాలన




**చొప్పదండి సెప్టెంబర్ 7,( జనం సాక్షి):** కాంగ్రెస్ వెయ్యి రోజుల అసమర్ధత పాలన, తెలంగాణలో మోసాలతో, దగాలతో అత్యంత దిగ్విజయంగా పూర్తి చేస్తుందని, కాంగ్రెస్ అధికారం చేపట్టినంక వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అని గారడీలు చేసి 420 హామీలు ఏమైనవి అడిగితే అరెస్టులు చేసి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేకత పాలన కొనసాగిస్తుందని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మండిపడ్డారు. అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలపై పోలీసుల దౌర్జన్య కాండను నిరసిస్తు చొప్పదండి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బత్తిని సంపత్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి మహాధర్నా చేపట్టి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. అలాగే కాంగ్రెస్ వెయ్యి రోజుల అసమర్ధత పాలనపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు చొప్పదండి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అంబెద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించిన ధర్నాలో రెవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేసే క్రమంలో పోలీసులు, నాయకులు మద్య తోపులాట జరిగింది. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్రెడ్డి,లను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించి గంట సేపు ఉంచి పంపించారు. ఈ సందర్భంగా సుంకె రవిశంకర్ మాట్లాడుతూ అధికారం చేపట్టి వెయ్యి రోజులు పూర్తవుతున్న, కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీను కూడా నెరవేర్చలేదని సోమవారం శాసనసభ సమావేశాలు ప్రారంభమైన సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తెలంగాణ ప్రజా గొంతుకై కాంగ్రెస్ ప్రభుత్వం నిలదీయాలని చూస్తే అసెంబ్లీ గేటు బయటనే అరెస్టు చేశారని, బీఆర్ఎస్ పార్టీ మహిళా ఎమ్మెల్యేను మెడపట్టి తోసేసారని ఇదేనా ప్రజాపాలన అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టులు చేసిన పరిస్థితి చూస్తే తెలంగాణలో చీకటి దినంగా బావిస్తున్నామని అన్నారు. పార్లమెంటులో కాంగ్రెస్ నాయకులు రాజీవ్ గాంధి పోటోలతో ఉన్న టీషర్టులను ధరించి పార్లమెంటు ముందు నిరసన చేపట్టవచ్చు, తెలంగాణలో నల్ల టీషర్టులతో నిరసనలు చేపడితే అక్రమ అరెస్టులు చేస్తారా అని అగ్రహం వ్యక్తం చేశారు. వారికో న్యాం మాకో న్యాయమా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలేకే కాదు తెలంగాణ శాసనసభకు కూడా రక్షణ లేని పరిస్థితి ఈ రోజు ఏర్పడదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులను కార్యకర్తలను ఎన్నిసార్లు అక్రమ అరెస్టు చేసిన, తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను, 420 హామీలను నెరవేర్చుదాక, తెలంగాణ ప్రజల, రైతుల, విద్యార్థుల, మహిళల, వృద్ధుల, ఉద్యోగుల, పక్షాన, అడుగడుగునా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నియోజక వర్గ సర్ ఇ ఇంచార్జ్ పెండ్యాల భూపతి రెడ్డి, మాజీ ఎంపీపీ చిలుక రవీందర్, మాజీ జెడ్పీటీసీ మాచర్ల సౌజన్య-వినయ్, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి, ఆరెల్లి చంద్రశేఖరౌడ్,కౌన్సిలర్ కొత్త సుమలత-గంగారెడ్డి, సర్పంచులు బంధారపు అజేయ్,మామిడి రాజేశం,వడ్లూరి లక్ష్మి-భూమయ్య, నాయకులు నలుమాచు రామకృష్ణ. లోక రాజేశ్వర్రెడ్డి, కోమల్ల రాజేశం, కొత్తూరి మహేశ్, ఎండీ అజ్జు ఏనుగు స్మామిరెడ్డి, వెల్మ నాగిరెడ్డి, గాండ్ల లక్ష్మణ్ గొలపల్లి శ్రావణ్, పెద్దెల్లి అనిల్, మారం యువరాజ్, జహీర్, వెంకటేష్ బైరి కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి లో 10 ఫిర్యాదులు

**మల్యాల సెప్టెంబర్ 7 (జనంసాక్షి)**
మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.గంట వరకు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 10 ఫిర్యాదులు వచ్చాయని 8 రెవెన్యూ,2 విద్యుత్ శాఖ సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయని వివిధ శాఖలకు సంబంధించి 16 మంది అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారని నోడల్ ఆఫీసర్ ఎంపిడిఓ స్వాతి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమంతో మండల పరిధిలోనే పరిష్కరించగల సమస్యల పరిష్కారం అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ ఎంపీడీఓ స్వాతి,తహసీల్దార్ శ్రీనివాస్,వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఐదు నెలల్లోనే బీమా పరిహారం

**◆ రూ.9.51 లక్షల చెక్కు అందించిన శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ**

మల్లాపూర్, సెప్టెంబర్ 07(జనంసాక్షి)
శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్న ఐదు నెలల్లోనే పాలసీదారుడు మృతి చెందగా,సంస్థ నిబంధనల మేరకు నామినీకి రూ.9.51 లక్షల బీమా పరిహారాన్ని అందజేశారు.మండల కేంద్రానికి చెందిన నిమిషకవి సారంగం శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్లో పాలసీ తీసుకుని ఒకే ప్రీమియం చెల్లించారు.అనంతరం గుండెపోటుతో సహజ మరణం చెందారు.ఈ నేపథ్యంలో పాలసీ నిబంధనల ప్రకారం రూ.9,51,000 బీమా మొత్తానికి సంబంధించిన చెక్కును నామినీ నిమిషకవి రాజేష్కు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ నిజామాబాద్ జోన్ డీజీఎం సురేష్ అందజేశారు. గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, ఉపసర్పంచ్ గడ్డం సోమారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో నిర్మల్ డివిజన్ డీఎం రవి,మెట్పల్లి బ్రాంచ్ మేనేజర్ నరేష్, డెవ లప్మెంట్ ఆఫీసర్లు రాజేష్, గణేష్, సేల్స్ మేనే జర్లు సాయందర్, కృష్ణ, కిసాన్ సెల్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఎల్లాల జలపతిరెడ్డి,బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీని వా స్రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ మనోహర్రెడ్డి, బిల్ కలెక్టర్ జగన్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఇసుక అక్రమ రవాణాపై పోలీసుల ఉక్కుపాదం..

**◆బొలెరో వాహనం పట్టివేత! అనుమతులు లేవు..**

**◆ఇసుక తరలిస్తే గుండెల్లో గుబులే!**

**◆గన్నేరువరంలో బొలెరో పికప్ వాహనం సీజ్!**




**గన్నేరువరం, సెప్టెంబర్ 07(జనంసాక్షి):**
గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి ఎక్స్ రోడ్ దగ్గర. రేణికుంట వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా సిద్దిపేటకు ఇసుక అక్రమ రవాణా. సోమవారం పెట్రోలింగ్ చేస్తుండగా గన్నేరువరం పోలీసులు వాహనాన్ని పట్టుకుని, పోలీస్ స్టేషన్కు తరలించి కేసు నమోదు చేశారు.
ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని స్థానిక ఎస్ఐ జి. నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి, అక్రమంగా ఖనిజాన్ని తరలిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. రాత్రికి రాత్రి అడ్డదారిలో సంపాదించాలనుకుంటే వాహనాలు సీజ్ కావడంతో పాటు కఠినమైన జైలు శిక్షలు తప్పవు!



## 9వ వార్డులో సీసీ రోడ్డు నిర్మించాలని వార్డు ప్రజల వినతి..

**చిగురుమామిడిసెప్టెంబర్ 7(జనంసాక్షి):**
మండలంలోని సుందరగిరి గ్రామ పంచాయతీ పరిధిలోని 9వ వార్డు దళిత కాలనీ అభివృద్ధికి ఆమడ దూరంలో మగ్గిపోతోందని సీపీఐ పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి ఎనగందుల రాజు,వార్డు ప్రజలు తీవ్ర ఆవేదన,ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు దళితవాడను పాలకవర్గం పూర్తిగా విస్మరించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.9వ వార్డు సమస్యలపై గ్రామ పంచాయతీ సెక్రటరీకి, సర్పంచ్కు,స్థానిక వార్డు మెంబర్లకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా కంటితుడుపు చర్యలే తప్ప ఎలాంటి స్పందన లేదన్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు, గ్రామ పాలకవర్గం తక్షణమే స్పందించి వెనుకబడిన తమ వార్డులో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర కనీస మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎలగందుల రాజు,ఎనగందుల చంద్రయ్య, ఎలగందుల రేణుక,ఎనగందుల ఎల్లవ్వ,ఎలగందుల రాణి,ఎలగందుల గీత, ఎలగందుల సుమలత, ఎలగందుల శాంత,ఎలగందుల పుష్ప,మంతెన కవిత,ఎలగందుల పూలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## శిలాఫలకంపై భర్త పేరు చేర్చడంపై ప్రజావాణిలో ఫిర్యాదు



**శంకరపట్నం సెప్టెంబర్ 7 జనం సాక్షి**
గ్రామంలో ఏర్పాటు చేసిన శిలాఫలకంపై మహిళా సర్పంచ్ పేరుతో పాటు ఆమె భర్త పేరును నమోదు చేయడంపై కాచాపూర్ ఉపసర్పంచ్ లింగంపల్లి కృష్ణారెడ్డి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం శంకరపట్నం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన అధికారులకు ఫిర్యాదు పత్రం అందజేశారు.కాచాపూర్ గ్రామంలో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన శిలాఫలకంపై గ్రామ సర్పంచ్ ఊకంటి మాధవి పేరుతో పాటు ఆమె భర్త పేరును కూడా నమోదు చేశారని కృష్ణారెడ్డి ఆరోపించారు. ప్రజాప్రతినిధిగా ఎన్నికైన మహిళా సర్పంచ్ పేరే శిలాఫలకంపై ఉండాల్సి ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా భర్త పేరును చేర్చడం సరికాదని ఆయన పేర్కొన్నారు.ఈ విషయంపై వారికి సూచించి నప్పటికీ పట్టించుకోలేదని కృష్ణారెడ్డి తెలిపారు. శిలాఫలకంపై పేర్ల నమో దు విషయంలో నిబంధనలు పాటించారా లేదా అనే అంశంపై అధి కారు లు సమగ్రంగా విచారణ చేపట్టాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించి నట్లు తేలితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు శిలాఫలకం పై పేర్లను నిబంధనల ప్రకారం సరిచేయాలని అధికారులను విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన ఇంచార్జీ అయేషా ఫాతిమా

**బోధన్, సెప్టెంబర్ 7 ( జనంసాక్షి ) :**
కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై సోమవారం బోధన్ నియోజకవర్గ ఇంచార్జి అయేషా ఫాతిమా ఆధ్వర్యంలో బోధన్ ఆర్డీవో విజయ కుమారికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసి గద్దెనెక్కి నేడు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు మరిచిపోయిందన్నారు. ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆమె ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఆరు గ్యారెంటీల అమలును పట్టించుకోకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంకు రానున్న రోజుల్లో ప్రజలు గట్టి బుద్ధి చెపుతారని ఆయేషా ఫాతిమా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ పట్టణ అధ్యక్షులు గాండ్ల రవీందర్ యాదవ్, మాజీ జడ్పీటీసీ గిర్దవర్ గంగారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్, కౌన్సిలర్లు గుమ్ముల అశోక్ రెడ్డి, మోబిన్, ముషీర్ బాబా, నాగరాజు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

## సిద్ధార్థ విద్యా సంస్థల అధినేత దాసరి శ్రీపాల్ రెడ్డి



**సుల్తానాబాద్,సెప్టెంబర్ 07(జనంసాక్షి) :** మండలంలోని సిద్ధార్థ నేహా కాన్సెప్ట్ పాఠశాల ఆవరణలో క్రీడల్లో రాణించిన విద్యార్థులను అభినందిస్తూ ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని పాఠశాల యాజమాన్యం ఏర్పాటు చేశారు.ఇటీవల ఎస్ .జీ.ఎఫ్ ఐ ఆధ్వర్యంలో జరిగిన మండల స్థాయి క్రీడా పోటీలలో ప్రతిభ చాటి, పతకాలు సాధించిన, టి ధనుష్ 9 వ తరగతి విద్యార్థిని విద్యా సంస్థల అధినేత దాసరి శ్రీపాల్ రెడ్డి సత్కరించి, మెమెంటోలను అందజేశారు.ఈ సందర్భంగా అధినేత మాట్లాడుతూ,చదువుతో పాటు క్రీడలు కూడా విద్యార్థుల మానసిక, శారీరక ఎదుగుదలకు ఎంతో తోడ్పడతాయని పేర్కొన్నారు.ఎప్పటికప్పుడు విద్యార్దులు వారు ఎంచుకున్న క్రీడలపై సాధన చేస్తేనే విద్యార్థులు విజయాలు సాధిస్తామని అన్నారు.క్రీడలతో క్రమశిక్షణ కల్గి ఉంటారని పాఠశాలలకు మంచి పేరు ఉంటుందని తెలిపారు.తమ సంస్థకు చెందిన విద్యార్థులు క్రీడల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచి సంస్థ పేరును నిలబెట్టడం గర్వకారణంగా ఉందన్నారు. భవిష్యత్తులో వీరు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, విద్యార్థులు విద్యాతో పాటు క్రీడల్లో రాణించాలని,విద్యార్థుల ప్రతిభను గుర్తిస్తూ వారిని ప్రోత్సహించడానికి తగిన కృషి చేస్తానని ఆయన తెలిపారు.వారికి సంస్థ తరపున అన్ని విధాలా పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సిద్ధార్థ విద్యా సంస్థల అధినేత దాసరి శ్రీపాల్ రెడ్డి ప్రిన్సిపాల్ ఝాన్సీ రాణి,పిఈటి జీవన్ ,పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొని విజేతలను అభినందించారు.

# కనీస వేతనాల సలహా మండలి లో జాతీయ సంఘాలను చేర్చాలి

## - సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు



సుల్తానాబాద్,సెప్టెంబర్ 07(జనంసాక్షి) : కేంద్ర ప్రభుత్వం నియమించిన జాతీయ కనీస వేతనాల సలహామండలిలో సిఐటియు, ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీలను చేర్చక పోవడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం, పూసాల పెద్దమ్మ గుడి వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ప్ల కార్డ్స్ తో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జాతీయ కనీస వేతనాల సలహా మండలిని నియమించిందని, ఇందులో చట్టపరంగా ఐదు జాతీయ కార్మిక సంఘాల ప్రతినిధులను సభ్యులుగా చేర్చాలి, కానీ జాతీయ సంఘాలైన సిఐటియు, ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీల ప్రతినిధులను నియమించకుండా తన కార్మిక వ్యతిరేక చర్యను మరొకసారి రుజువు చేసుకుంది. దేశంలో పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలకు అనుగుణంగా కార్మికుల కనీస వేతనాలు నిర్ణయించే, సూచనలు ఇచ్చే ఈ సలహా మండలికి తన తొత్తు సంఘాల ప్రతినిధులను, యాజమాన్య ప్రతినిధులను, స్వచ్ఛంద సంస్థల పేరుతో బిజెపి ప్రభుత్వానికి వంతపాడే వారితో ఈ సలహా మండలి నియమించడం అంటే ,కార్మికుల యొక్క కనీస వేతనం ఇవ్వకుండా దేశంలోని పెట్టుబడుదారులకు, కార్పొరేట్ శక్తులకు కార్మికుల శ్రమను దోచిపెట్టడానికి ఈ సలహా మండలి పనిచేస్తుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర బీజేపీ ప్రభుత్వం తన తప్పుడు వైఖరిని మానుకొని గుర్తింపు పొందిన జాతీయ కార్మిక సంఘాల అయినటువంటి సిఐటియు, ఏఐటీయూసీ, ఐఎన్టియుసి సంఘాల జాతీయ నాయకులను కనీస వేతనాల సలహా మండలిలో చేర్చాలని డిమాండ్ చేశారు, లేకపోతే ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు సుల్తానాబాద్ మండల కన్వీనర్ తాండ్ర అంజయ్య, కోకన్వీనర్ మాతంగి రాజమల్లు, రైస్ మిల్లు ఆపరేటర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నౌండ్ల బ్రహ్మచారి,బండారి స్వామి,వీరగోని కిరణ్, పర్వతాలు,బండారి తిరుపతి, మాతంగి శంకర్, శీను, నయీమ్, సలోమి,ఈశ్వరమ్మ, బచ్చన్దేవ్, వకీల్,నాయకులున్నారు.

# ఎస్‌జీఎఫ్ పోటీల్లో ఐపీఎస్ విద్యార్థుల ప్రతిభ

- కబడ్డీ, వాలీబాల్‌లో ప్రథమ బహుమతులు
- విద్యార్థులను అభినందించిన పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ ప్రిన్సిపల్ కృష్ణప్రియ

**సుల్తానాబాద్,సెప్టెంబర్ 07(జనంసాక్షి) :** మండల కేంద్రంలోని ఇండియన్ పబ్లిక్ పాఠశాల (ఐపీఎస్)లో మూడు రోజులపాటు నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో ఆ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మండల ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో పలు విభాగాల్లో బహుమతులు సాధించారు. కబడ్డీ అండర్-17 బాలికల విభాగంలో ఐపీఎస్ జట్టు ప్రథమ బహుమతి సాధిం చింది. వాలీబాల్ అండర్-17 బాలుర విభాగం లోనూ ప్రథమ స్థానంలో నిలిచింది. ఖోఖో అండర్-14 బాలికల విభాగంలో ద్వితీయ బహుమతి, వాలీబాల్ అండర్--17 బాలికల విభాగంలో ద్వితీయ బహుమతి సాధించారు.అథ్లెటిక్స్‌లో షాట్‌పుట్ అండర్-14, అండర్-17 బాలికల విభాగాల్లో ప్రథమ బహుమతులు సాధించగా, అండర్-14 బాలుర విభాగంలో తృతీయ బహుమతి దక్కింది. వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ అభినందించారు.చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకుని నిరంతరం సాధన చేయాలని వారు విద్యార్థులకు సూచించారు. క్రీడల్లో ప్రతిభను మెరుగు పరుచుకుని జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు.కార్యక్రమంలో పాఠశాల మేనేజర్ శివ, వైస్ ప్రిన్సిపాల్ సునీత వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, సతీష్, జ్యోతి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.







# పల్లవి పాఠశాల సీబీఎస్ఈ లో ఘనంగా ముగిసిన ఎస్ జి ఎఫ్ క్రీడలు




**పెద్దపల్లి,సెప్టెంబర్ 07(జనంసాక్షి) :** పెద్దపల్లి మండలం నిమ్మనపల్లి పల్లవి పాఠశాల (సీబీఎస్ఈ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ జి ఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) క్రీడా పోటీలు సోమవారం నాటికి ముగి సాయి.పాఠశాల కరస్పాండెంట్ టి. శోభారాణి ఆధ్వర్యంలో నిరంతర ప్రోత్సాహం, మార్గదర్శకత్వం మరియు ప్రత్యేక శ్రద్ధతో ఈ క్రీడోత్సవం ఘనంగానిర్వహించబడిందన్నారు. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథులు: ఎ. సురేష్ డిప్యూటీ స్పోర్ట్స్ అథారిటీ (జిల్లా యువజన మరియు క్రీడల అధికారి)డాక్టర్ సురేందర్ (పి ఈ టి) (తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు) సి ఎచ్ .శైలజ( ఎస్ జి ఎఫ్) మండల కన్వీనర్)టి. శోభారాణి (కరస్పాండెంట్)వ్యాయామ ఉపాధ్యాయులు నిర్వాహక బృందం: ఈ వేడుక విజయవంతం కావడానికి శ్రమించిన వ్యాయామ ఉపాధ్యాయులు మరియు నిర్వాహకులు : జాబ్రీధర్ రెడ్డి, మంజుల రెడ్డి, మంజు (పీఈటి) శ్రీనివాస్ (అడ్మిన్), అనిల్ (పిఈటి), భాస్కర్, ఇమ్రాన్, జ్ఞానేశ్వరి, షఫీ, మనోహర్, మహేందర్, షోయబ్ మరియు రాకేష్ (అడ్మిన్ - పల్లవి స్కూల్).బహుమతుల ప్రధానోత్సవం : విజేతలందరికీ బహుమతులు మరియు ప్రశంసా పత్రాలు అందజేశారు. అలాగే, క్రీడా స్ఫూర్తిని చాటుకున్న ప్రతి ఒక్క క్రీడాకారుడిని మనస్ఫూర్తిగా అభినందించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, విద్యార్థులు క్రీడల్లో మరింత ఎత్తుకు ఎదగాలని, తమ ప్రతిభను చాటుకోవాలని స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు.కరస్పాండెంట్ శోభారాణి మాట్లాడుతూ, విద్యార్థుల సంక్షేమం, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం మరియు నిజమైన క్రీడా స్ఫూర్తి యొక్క ప్రాముఖ్యతను వివరించారు.మా పల్లవి స్కూల్ నుండి సెలెక్ట్ అయిన విద్యార్థిని విద్యార్థులను కరస్పాండెంట్ శోభారాణి అభినందించారు.

# చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలి

## - ప్రశ్నించే,బి ఆర్ ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకోవడం సిగ్గుచేటు

## - బిఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టుకు నిరసనగా పార్టీ శ్రేణుల భారీ రాస్తారోకో

**సుల్తానాబాద్,సెప్టెంబర్ 07(జనంసాక్షి) :**

చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని,హామీలను మరిచి పాలన కొనసాగిస్తున్న ప్రభుత్వాన్ని నిలదీసేందుకు అసెంబ్లీకి వెళుతున్న బి ఆర్ ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు, కేటీఆర్,ను అడ్డుకోవడం సిగ్గుచేటని సోమవారం మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో చేరుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను ఇచ్చి హామీలు నెరవేర్చలేదని హెచ్చరించారు. ప్రభుత్వం ను,ప్రశ్నించే ప్రతిపక్షాన్ని అడ్డుకొని రెస్ట్ చేయడం సమంజసం కాదని ఇచ్చిన హామీలను అమలు చేయాలని హామీలు అమలు చేయకుండా కేవలం కల్లబొల్లి మాటలతో వెయ్యి రోజులు కాలయాపన చేసి ప్రస్తుతం సంబరాలు చేసుకోవడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. ప్రతిపక్షంగా ఇచ్చిన హామీలను చేస్తున్న తప్పులను ఎత్తిచూపితే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాటు హరీష్ రావు ఇతర బి ఆర్ ఎస్ ఎమ్మెల్యేలను అక్రమ అరెస్టు చేయడం సిగ్గుచేటని ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. నిరసన తెలుపకుండా పోలీసులతో అరెస్టు చేపించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు జూపల్లి సందీప్ రావు, బోయిని రాజమల్లయ్య, మొలుగూరి అంజయ్య గౌడ్, సుర శ్యాం, తిప్పారపు దయాకర్,సర్పంచ్ లు ఓజ్జా సంపత్, సట్టు ఉత్తమ కుమారి, ఫకీర్ యాదవ్, గెల్లు శ్రీనివాస్, కొయ్యడ అరుణ్ కుమార్, కూకట్ల గోపి, మైలారం నారాయణ, మోరపల్లి మోహన్ రెడ్డి,పొన్నం సంపత్, బండి సంపత్, శ్రీనివాసరావు, గుర్రం శ్రీనివాస్, అనుమాల బాబురావు, పసిడ్ల సంపత్, మహమ్మద్,రఫిక్, వెంకటేష్, తిప్పారపులక్ష్మణ్, ఆరేపల్లి రాకేష్ లతోపాటు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. సీఎం దిష్టిబొమ్మ దగ్ధాన్ని అడ్డుకున్న పోలీసులు : బిఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టును నిరసిస్తూ రాస్తారోకో చేపట్టిన బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని దిష్టిబొమ్మను అడ్డుకున్నారు.



### ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు

# వేగవంతంగా పూర్తి చేయాలి

◆ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి
◆ హియరింగ్ అనంతరం డేటా ఎంట్రీలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి






పెద్దపల్లి,సెప్టెంబర్ 07(జనంసాక్షి) : ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసుల జనరేషన్, నోటీసుల జారీ, నిర్వహించిన విచారణలు, డేటా నమోదు తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సోమవారం అన్ని జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.పెద్దపల్లి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష,అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీరాములు,అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అరుణశ్రీ తో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని జిల్లాల వారీగా సమీక్షించారు.ఇప్పటివరకు జనరేట్ చేసిన నోటీసులు,ఓటర్లకు జారీ చేసిన నోటీసులు, పూర్తయిన విచారణల వివరాలను పరిశీలించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎక్కడా జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా ప్రతి దశను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.మ్యాపింగ్ లేని ఓటర్లు, వివిధ రకాల అనామలీస్ గుర్తించిన ఓటర్లకు సంబంధించి నోటీసులు తప్పనిసరిగా జనరేట్ చేసి, సంబంధిత ఓటర్లకు జారీ చేయాలని ఆదేశించారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం తగిన సమయం కల్పించి విచారణ నిర్వహించాలని సూచించారు.నోటీసు జారీ చేసిన అనంతరం లిలిఏడు రోజుల వ్యవధి ఉండేలా చూసి విచారణ నిర్వహించాలనిలిలి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. విచారణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహించాలని, అర్హత కలిగిన ఓటర్ల హక్కులు పరిరక్షించబడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులతో లిలిప్రతి వారం క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలనిలిలి ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు ప్రక్రియపై అవసరమైన సమాచారం అందిస్తూ, వారి సూచనలు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలని తెలిపారు.డేటా ఎంట్రీ ప్రక్రియను వేగవంతం చేసేందుకు అవసరమైతే అదనపు లాగిన్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.హియరింగ్ పూర్తయిన అనంతరం సంబంధిత వివరాలను డేటాలో లిలిఎలాంటి పొరపాట్లు లేకుండా, అత్యంత జాగ్రత్తగా నమోదు చేయాలనిలిలి అధికారులను ఆదేశించారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి దశలోనూ ఖచ్చితత్వం, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.ఈ సమావేశం లో ఆర్డీవో గంగయ్య,ఈ సెక్షన్ సూపరిటెండెంట్ విజయ్ ,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



## 420 హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- ప్రజావాణిలో హామీల అమలుపై బీఆర్ఎస్ వినతిపత్రాలు
- మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

పెద్దపల్లి,సెప్టెంబర్ 07(జనంసాక్షి) : కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 420 హామీల అమలుపై వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఆ తర్వాత హామీల అమలును విస్మరించిందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకుందని అన్నారు.మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ దాసరి మమతా రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో నిర్లక్ష్యం చేయడం వల్ల రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.ముఖ్యంగా మహిళలు, యువత, విద్యార్థులు మరియు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు,ప్రజాప్రతినిధులు,తదితరులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

### ఆశా వర్కర్ల న్యాయమైన

# డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి

పెద్దపల్లి,సెప్టెంబర్ 07(జనంసాక్షి) : ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని కోరుతూ సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నా, రాస్తారోకో కార్యక్రమానికి పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డిలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో క్షేత్రస్థాయిలో కీలకంగా పనిచేస్తున్న ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. తక్కువ పారితోషికంతో, అనేక రకాల బాధ్యతలు నిర్వహిస్తున్న ఆశా వర్కర్లపై అదనపు పనిభారం, టార్గెట్లు మోపడం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు.ఆశా వర్కర్లపై విధిస్తున్న టార్గెట్లను ఎత్తివేయాలని,ఖాళీగా ఉన్న ఆశా వర్కర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఆశా వర్కర్లను బి ఎల్ ఓ విధుల నుంచి తొలగించాలని, ఆశా వర్కర్లకు నెలకు రూ.18,000 ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని, ఆశా వర్కర్లకు హెల్త్ కార్డులు జారీ చేయాలని, ప్రభుత్వ పథకాలు, ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆశా వర్కర్లు అందిస్తున్న సేవలు ఎంతో కీలకమైనవని దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. వారి సేవలను గుర్తించి గౌరవప్రదమైన వేతనం, మెరుగైన పని పరిస్థితులు, సామాజిక భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి మాట్లాడుతూ ఆశా వర్కర్ల డిమాండ్లు న్యాయమైనవేనని, ప్రభుత్వం వారి సమస్యలను సానుభూతితో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు,బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## నేడు ఆటోలకు వేలం పాట

**ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ సరిత..**

గోదావరిఖని, జనంసాక్షి : పెద్దపల్లి జిల్లా మద్య నిషేధ అండ్ అబ్కారీ అధికారి ఆదేశాల మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ రామగుండం పరిధి ఒక కేసులో పట్టుబడిన ఆటోకు ఈనెల 8న ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్టు ఎక్సైజ్ సీఐ ఎన్.సరిత ఒక ప్రకటనలో తెలిపారు.ఈ వేలం పాటలో పాల్గొనదలచిన వ్యక్తులు ఉదయం 9 గంటలకు రామగుండం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించి 50శాతం ఈఎండి చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.సరిత తెలిపారు.

## సీఎంఆర్ బియ్యం డెలివరీని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి : కలెక్టర్

◆ డిఫాల్ట్ రైస్ మిల్లర్లు బకాయిలు చెల్లించకుంటే ఆస్తులపై చర్యలు ◆ బకాయిలు చెల్లించిన మిల్లర్లకు తదుపరి సీజన్‌లో ధాన్యం అలాట్మెంట్ ◆ వానాకాలం ధాన్యం నిల్వకు 2 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాముల గుర్తింపు ◆ ప్రభుత్వ గోదాములను అనుమతి లేకుండా కేటాయించరాదు ◆ రైస్ మిల్లర్లతో సీఎంఆర్ డెలివరీపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి,సెప్టెంబర్ 07(జనంసాక్షి) : 2025-26 సంవత్సరానికి సంబంధించిన ఖరీఫ్, రబీ పంటల కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీని రైస్ మిల్లర్లు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు సంబంధిత అధికారులతో కలిసి రైస్ మిల్లర్లతో సీఎంఆర్ డెలివరీ, డిఫాల్ట్ రైస్ మిల్లర్లు, బకాయిల చెల్లింపులు, గోదాముల లభ్యత తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ 2025-26 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన సీఎంఆర్ బియ్యం డెలివరీలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని రైస్ మిల్లర్లను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సీఎంఆర్ డెలివరీ పూర్తి చేసేలా మిల్లర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలో డిఫాల్ట్ అయిన రైస్ మిల్లర్లు తమ బకాయిలను వెంటనే చెల్లించాలని స్పష్టం చేశారు. బకాయిలు చెల్లించని డిఫాల్ట్ రైస్ మిల్లర్లపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం ఆస్తులపై చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బకాయిలను పూర్తిగా చెల్లించిన రైస్ మిల్లర్లకు తదుపరి సీజన్‌లో ధాన్యం అలాట్మెంట్ చేసే అవకాశం కల్పిస్తామని తెలిపారు. మిల్లర్లు తమ బకాయిలను సకాలంలో చెల్లించి ప్రభుత్వానికి సహకరించాలని సూచించారు.వానాకాలం ధాన్యం కొనుగోళ్లను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిల్వ చేసేందుకు అవసరమైన గోదాములను ముందుగానే గుర్తించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల అనంతరం నిల్వకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచించారు.జిల్లాలోని ప్రభుత్వ గోదాములను అనుమతి లేకుండా ఎవరికీ కేటాయించడానికి వీల్లేదని స్పష్టం చేశారు.గోదాముల లభ్యత, నిల్వ సామర్థ్యం, వినియోగానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.సీఎంఆర్ డెలివరీ,ధాన్యం నిల్వ,గోదాముల నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, ప్రభుత్వ లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీకాంత్, సంబంధిత అధికారులు,రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.